# 1. పరిచయం

**"సృష్టి"ని ఆరాధించాలా?**

**"సృష్టికర్త"ను (నిజ దేవుణ్ణి) ఆరాధించాలా?**

– ఇది మానవ జీవితంలో అత్యంత ప్రధానమైన నిర్ణయం. ఈ నిర్ణయం పైనే మానవుని తదుపరి జీవితం ఆధారపడి ఉంటుంది. విశ్వాన్ని సృష్టించిన దేవుడు మానవులమైన మనందరికీ బుద్ధినీ, ఆలోచనను, అవగాహనా శక్తిని అనుగ్రహించాడు. కనుక "ఆరాధన" విషయంలో మానవులు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. సాధారణంగా ఈ విషయానికి సంబంధించి ఎన్నో రకాల సాక్ష్యాధారాలు మన ముందుకు వస్తుంటాయి. అయితే వాటిని విశ్లేషించే క్రమంలో మనలోని భావోద్వేగాలు మన మీద అనుకూల లేక ప్రతికూల ప్రభావాలు చూపుతుంటాయి. ఇటువంటి భావోద్వేగాలకు అతీతంగా, నిష్పక్షపాతంగా సాక్ష్యాధారాలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిశోధించి అత్యంత సవ్యమైన ఆరాధనా మార్గాన్ని ఎంపిక చేసుకోవటం మనిషి కర్తవ్యం. ఇక ఆ నిర్ణయానికి విరుద్ధమైన నిదర్శనాలు ముందుకు రానంతవరకు అదే నిర్ణయంపై తిరుగులేని విశ్వాసాన్ని కనబరచటం అవశ్యం.

సృష్టి ప్రారంభం నుంచి నేటిదాకా ఈ యావత్తు విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త మారలేదు. ఇది నిజం. సృష్టిచరిత్రలో ఎన్నటికీ తిరుగులేని ఏకైక సత్యం. పాఠక మహాశయులకు ఈ సత్యాన్ని సాక్ష్యాధారాలతో సహా నిరూపించే ప్రయత్నమే ఈ చిరుపుస్తకం. భావోద్వేగాలు, అపోహలు మన కళ్లను వాస్తవాలకు దూరం చేస్తాయి. సత్యాన్ని అర్థం చేసుకోనీయకుండా అడ్డుకుంటాయి. కనుక సన్మార్గాన్ని కనుగొనాలంటే ముందుగా మనలోని భావోద్వేగాలను అధిగమించాలి. మన హృదయ లోయల్లో తిష్ఠవేసుకొని కూర్చున్న అపోహలను తొలగించుకోవాలి. సత్యాన్వేషకులు ఈ వాస్తవాన్ని ఎన్నడూ విస్మరించరాదు. అప్పుడే దేవుడు తమకు ప్రసాదించిన బుద్ధిని వారు సద్వినియోగం చేసుకోగలుగుతారు. సరైన, సమంజసమైన నిర్ణయాలు తీసుకోగల్గుతారు.

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన నిజదైవం పేరుతో ప్రారంభం

## 2. అందరికీ ఉపయోగకర సందేశం

మిత్రమా!

నువ్వెప్పుడైనా ఈ విషయాల గురించి, అసలు కాసేపయినా ఆలోచించావా? చూడు! భౌతికంగా ఈ ప్రపంచం శరవేగంగా ముందుకు దూసుకు వెళుతోంది. ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువు మునుపెన్నడూ లేని విధంగా ఆధునీకరించబడుతోంది. కనివిని ఎరుగని రీతిలో కంప్యూటరీకరించబడుతోంది. ఒకప్పుడు భూ ఉపరితలం మీద నిలుచొని నిశీధి వీధిలో గారాలు పోతున్న చందమామ వంక వింతగా చూశాడు మనిషి! మరి అదే మనిషి ఈ రోజు చంద్రమండలంపై నిశ్చింతగా అడుగు పెట్టగలుగుతున్నాడు. అవునండీ! మానవుడు ప్రగతి చెందాడు. విపరీతమైన అభివృద్ధి గడించాడు. కాని మీరు గమనించారో లేదో! అదే సమయంలో మానవుడు ఎంతగానో, మరెంతగానో, ఇంకెంతగానో నిస్సహాయునిగానూ మారిపోతున్నాడు. ఒక్కసారి మీ పరిసరాలను పరికించి చూడండి! మనిషి సాటి మనిషికే బద్ధ శత్రువైపోయాడు. అమానుష చర్యలన్నిటికీ అతను అలవాటుపడ్డాడు. వెరసి అన్ని రకాల సామాజిక నేరాలకు, ఘోరాలకు బలవుతున్నాడు. చెడుల చెట్టుగా, పాపాల పుట్టగా పరిణమించాడు. ఫలితంగా సమాజంలో దుర్మార్గం విపరీతంగా వ్యాపిస్తూ పోతోంది. చివరికి సద్గుణాలకు స్థానం లేని, నైతిక విలువలకు ప్రాముఖ్యత లేని తరుణం సంభవించింది.

ఒక్క క్షణం ఆగండి! మీ పరిసరాలను నిశితంగా పరిశీలించండి. మీ పర్యావరణాన్ని క్షుణ్ణంగా పరికించండి. సూర్యుడు, నక్షత్రాలు, చంద్రుడు, ఆకాశం, గ్రహాలు, చెట్లు, కొండలు అన్నీ ఒక క్రమ పద్ధతిలో ఉన్నాయి. ఆ వ్యవస్థలో ఎటువంటి అపసవ్యత లేదు. ఎందుకో తెలుసా? అవి తమ సృష్టికర్త తమ కొరకు నిర్ణయించిన మార్గాన్ని అనుసరిస్తున్నాయి. నిజదేవుడు నిర్దేశించిన ప్రకృతి నియమాలకు విధేయత చూపుతున్నాయి. మరి వాస్తవానికి వాటిని సృష్టించినవాడూ, మనల్ని సృష్టించినవాడూ ఒక్కడే. మన గొంతుల్ని తడిపే నీరు ఒక్కటే. మన ఆకలిని చల్లార్చే ఆహారం ఒకటే. మనం పీల్చే గాలి ఒక్కటే. మానవులమైన మనందరి నరాల్లో ప్రవహించే రక్తం ఒక్కటే. క్లుప్తంగా చెప్పుకోవాలంటే, ఆకాశాలలో, భూగోళంలో ఉన్న జీవులన్నిటినీ సృష్టించిన సృష్టికర్త ఒక్కడే.





మనందరికి సృష్టికర్త ఒక్కడే అయినప్పుడు, ఆ సృష్టికర్తకు సంబంధించి ప్రజలలో వివిధ భావనలు ఎలా పుట్టుకొచ్చాయి? అసలు దేవుడు తన గురించి స్వయంగా, అత్యంత స్పష్టంగా నిర్వచించి చెప్పినప్పుడు మానవులు మిథ్యా దైవాలను ఆశ్రయించవలసిన అవసరం ఏముంది? ఇలాంటివి ఆలోచనాపరులను అనుక్షణం తొలిచే ప్రశ్నలు. బుర్రకు కాస్తంత పని పెడితే ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకటం ఏమాత్రం కష్టం కాదు. మూడు ముక్కల్లో చెప్పుకోవాలంటే, మానవుడు దేవుని విషయంలో పూర్తిగా అజ్ఞానానికి లోనై ఉన్నాడు. జగతిలో అడుగడుగునా అగుపించే వాస్తవాలను వెనక్కి నెట్టేసి కేవలం ఊహా లోకంలో విహరిస్తున్నాడు. తేటమైన నిజాలను వదిలేసి ఊహలను, అపోహలను అనుసరిస్తున్నాడు.

### ఇంకో విషయం సుమండీ!

తల్లి కడుపును చించుకుని ఈ భూమ్మీదకు వచ్చే శిశువు మొట్టమొదటగా ఈ లోకంలో ఏం చేస్తుంది?

ఏడుస్తుందా....?
పాలు తాగుతుందా.....?

లేదు. మొట్టమొదటగా అది ఈ భూమ్మీద పడగానే **శ్వాశ తీసుకుంటుంది.** అది లేకుండా ఈ ప్రపంచంలో ఎవరూ జీవించలేరు. మరి ఈ శ్వాసించే శక్తి కూడా ఒక జీవికి ఎవరు ఇచ్చారండీ? సందేహం లేదు. సర్వశక్తి మంతుడైన సృష్టికర్తే. ఆయన ఈ విశ్వాన్నంతటినీ ఉనికిలోకి తెచ్చిన నిరుపమాన శక్తిమంతుడు.

శిశువును పుట్టించేది, ఆ శిశువుకు శ్వాసించే శక్తియుక్తులను ప్రసాదించేదీ ఆయనే. ఆ చిన్నిశ్వాస లేకపోతే ఏ చిన్నారీ ఈ లోకంలో బతికి బట్టకట్టలేదు. ప్రతి మనిషిలోనూ, ప్రతి జీవిలోనూ జరిగే క్రియల్లో అత్యంత ప్రధానమైనది ఈ శ్వాశప్రక్రియ. అదే లేనప్పుడు జీవులు కాలగర్భంలో కలసిపోవటానికి కొన్ని క్షణాలు కూడా పట్టదు.

గాలి పీల్చాలని మనం సంకల్పించుకోము. అందులో మన ప్రమేయం ఏమాత్రం ఉండదు. అయినా ప్రమేయరహితంగానే, అసంకల్పికంగానే మానవులమైన మనం అనుక్షణం గాలిని లోనికి పీలుస్తున్నాం. బయటికి విడుస్తున్నాం. ఆక్సిజన్ వాయువును లోనికి పీల్చుకుని, కార్బన్ డై ఆక్సైడ్‌ను బయటకు విడిచే ఈ ప్రక్రియ

మన ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే జరిగిపోతోంది. నిజం చెప్పాలంటే ఈ ప్రక్రియ సృష్టికర్త ఆజ్ఞలకు అనుగుణంగా నడుస్తోంది. జీవన్మరణాలు ఆయన చేతుల్లోనే ఉన్నాయి. మనుషుల చేతుల్లో ఏమీ లేదు. నక్షత్ర మండలాలు, యావత్తు విశ్వంలోని సమస్త విషయాలు ఆయన ఆజ్ఞలకు, అనుజ్ఞలకు లోబడి మసలుకుంటు న్నాయి.

సృష్టికర్త మనకు జీవితం ఇచ్చాడు! మన మనుగడకు అవసరమైన ప్రతి వస్తువునూ ప్రసాదించాడు. అందుకు మనం ఆయనకు కృతజ్ఞులుగా, ఆత్మార్పితులుగా మసలుకునే కనీస విధిని కూడా నిర్వర్తించలేమా?

**నిర్వర్తించగలం.**

**నిర్వర్తించగలగాలి.**

**తప్పకుండా చేయాలి.**

అది మానవుని ప్రప్రథమ కర్తవ్యం. జీవితపు మొట్టమొదటి విధి.

మరి ఆయనకు కృతజ్ఞత చూపటమెలా? అంటే ముందుగా మనం ఆయన శక్తిమాన్యతను అంగీకరించాలి. అనంతమైన ఆయన బలాధిక్యత ముందు వినమ్రంగా తలవంచాలి. తర్వాత ఆయన్ని సంపూర్ణమైన, సవ్యమైన భావనలతో గుర్తించాలి. అలా చేయాలంటే దైవత్వపు భావన మన కళ్లముందు స్పష్టంగా ఉండాలి కదా! అందుకే వివిధ ధర్మాలలో, దైవిక గ్రంథాలలో ప్రస్తావితమై ఉన్న "వాస్తవ దైవ భావన"ను ముందుగా మనం అర్థం చేసుకోవాలి.

వాస్తవ దైవ భావన ప్రకారం దేవుడు ఒక్కడే. సృష్టి ప్రక్రియలో ఆయనకు భాగస్వాములెవరూ లేరు. మానవ సన్మార్గం కోసం ఈ భూమ్మీద అవతరించిన దైవిక గ్రంథాలన్నీ ముక్త కంఠంతో ఈ విషయాన్ని చాలా స్పష్టంగా వివరించాయి.

వేదాల్లోనూ ఈ విషయం చాలా స్పష్టంగా ప్రస్తావనకు వచ్చింది

**"ఏకం బ్రహ్మం, ద్వితీయ నాస్తి , నేహ్న నాస్తి కించన్"**

**అర్థం...**

**"దేవుడు ఒక్కడే, రెండవ వాడు లేదు, అస్సలు లేదు, అస్సలు లేదు, కొంచెం కూడా లేదు"**





హిందూ మతంలోని పై **బ్రహ్మ సూత్రం** సవ్యమైన, వాస్తవమైన దైవభావనను తేటతెల్లం చేసింది.

ఇక ఈ క్రింద పేర్కొనబడిన ఉపనిషత్తుల సూక్తులు పై సూత్రానికి సజీవ సాక్ష్యాలు.

"ఏకం ఎవద్వితీయం"

**"ఆయన ఒక్కడు. ఆయన తప్ప మరొకడు లేడు"**

*(చందోగ్య ఉపనిషత్ 6 : 2 : 1)*

ఉపనిషత్తులోని మరో సూక్తి ఇలా చెబుతోంది:

"న చాస్యకశ్చిజ్జనితా న చాధిపః"

**"ఆయనకు తల్లిదండ్రులు లేరు. ఆయనకు ప్రభువు లేడు."**

*(శ్వేతాశ్వతరోపనిషత్ 6 : 9 / యజుర్వేదం 32 : 3)*

ఉపనిషత్తుల్లోని ఇంకో సూక్తి విశ్వ ప్రభువు ఏకత్వాన్ని ఇలా చాటిచెప్పింది:

"న తస్య ప్రతిమ అస్తి"

**"ఆయనకు సాటి సమాన రూపము ఏదీ లేదు."**

*(శ్వేతశ్వతరోపనిషత్ 4 :19)*

బైబిల్ గ్రంథం సైతం ఏక దైవారాధనా ప్రబోధనలకు అతీతం కాదు. కొత్త నిబంధన గ్రంథంలో ఇలా ప్రస్తావించబడింది:

**"మీరు భూమి మీద ఎవనికైననూ తండ్రి (దేవుడు) అని పేరు పెట్టవద్దు. ఒక్కడే మీతండ్రి (దేవుడు). ఆయన పరలోకమందున్నాడు."** *(మత్తయి 23:9)*

మరోచోట బైబిలులో ఇలా చెప్పబడింది:

**"కావున మీరు ఎవనితో దేవుని పోల్చుదురు? ఏ రూపమును ఆయనకు సాటి చేయగలరు?"** *(బైబిలు యెషయా 40:18)*

నిజదేవుని రూపురేఖలను ఊహించటం మనిషితరం కాదని ఇంకో వాక్యం కుండబద్దలు చేసింది:

**"మీరు ఏ కాలమందైనను ఆయన స్వరము వినలేదు. ఆయన స్వరూపము చూడలేదు."** *(యోహాను 5:37)*

ఇక దేవుని అంతిమ గ్రంథమైన "దివ్యఖుర్ఆన్" కూడా అత్యంత సులువైన మాటల్లో వాస్తవ దైవ భావనను ఈ విధంగా విపులీకరించింది:

ఆయన నిజమైన ఆరాధ్యుడు ఒక్కడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు.(ఏ అక్కరా లేనివాడు). ఆయన (ఎవరినీ) కనలేదు. ఆయన (కూడా) ఎవరికీ పుట్టినవాడు కాదు. ఆయనకు సరిసమానుడు (పోల్చదగిన వాడు) ఎవడూ లేడు.

(ఖుర్ఆన్ 112 : 1-4)

ఈ విధంగా మనం ముందుగా, దేవుడు ఒక్కడేనని, ఆ ఒక్క దేవుడు తప్ప మరో దేవుడు లేడన్న వాస్తవ అభిప్రాయానికి రావాలి. ఆ ఒక్క నిజదేవునికే మన ఆరాధనలను అంకితం చేసుకోవాలి. ఆయన తప్ప మరే వస్తువూ మన ఆరాధనకు అర్హమైనది కాదన్న సత్యాన్ని గ్రహించాలి. సృష్టికర్తను వదలి ఇతరులను ఆరాధించే వ్యక్తి అంధకారంలో ఉన్నాడని, అతను అపమార్గంలో పయనిస్తున్నాడని మనం అప్రమత్తం కావాలి.

సృష్టిరాసులను పూజించేవారు మార్గభ్రష్టులని వేదాలు ఖరాకండీగా చెప్పేశాయి. ఈ భూమ్మీద సృష్టికర్తను వదలి ప్రకృతి వస్తువులను పూజించే వారిని క్రింద పేర్కొనబడిన యజుర్వేద మంత్రం ఇలా హెచ్చరిస్తోంది:

"అంధః తమ ప్రవిషన్తి యె అసంభుతి ముపస్తే"

"ఎవరైతే ప్రాకృతిక వస్తువులను (గాలి, నీరు, మొ॥ వాటిని) పూజిస్తారో వారు చీకటి (నరకం)లో ప్రవేశిస్తారు. ఎవరైతే సంభుతి (సృష్టితాలు – మానవుని చేత తయారయ్యే వస్తువులు, బొమ్మల)ని పూజిస్తారో వారు మరింత అంధకారంలో ప్రవేశిస్తారు." (యజుర్వేదం 40 : 9)

యజుర్వేదంలోనే మరోచోట ఇలా చెప్పబడింది:

"సర్వాంతర్యామి అయిన దేవునికి బదులు శాశ్వత ప్రకృతిని – ప్రపంచపు భౌతిక కారణాన్ని– పూజించేవారి చుట్టూ అంధకారం ఉంది. ఇంకో మాటలో చెప్పాలంటే వారు అజ్ఞానంలో మునిగి వున్నారు. బాధా సముద్రపు అట్టడుగున చిక్కుకొని ఉన్నారు. ఇక నిజదేవుణ్ణి వదలిపెట్టి ప్రకృతి నుంచి పుట్టిన, కంటికి కనిపించే భూమి, చెట్లు, (మానవ లేక ఇతర) దేహాలు మొదలగు వాటిని





పూజించేవారయితే అంతకన్నా అంధకారంలో ఉన్నారు. మరో మాటలో చెప్పాలంటే వారు మహా మూర్ఖులు. వారు భయంకరమైన నరకంలో పడతారు. అందులో సుదీర్ఘ కాలం పాటు దుఃఖాన్ని, బాధలను, కష్టాలను అనుభవిస్తూ ఉంటారు." (యజుర్వేదం 40 : 9)

ఈ భూమ్మీదకు దేవుని తరఫున చిట్టచివరిగా అవతరించిన దివ్యగ్రంథం **"ఖుర్ఆన్"** కూడా ఈ విషయాన్నే స్పష్టీకరిస్తోంది. చూడండి:

"భూమ్యాకాశాల సార్వభౌమత్వం ఆయనదే. ఆయన ఎవరినీ సంతానంగా చేసుకోలేదు. ఆయన రాజ్యాధికారంలో ఆయనకు భాగస్వాములు కూడా ఎవరూ లేరు. ఆయన ప్రతి వస్తువునూ సృష్టించి, దానికి తగ్గట్టుగా – దాని లెక్కను నిర్ధారించాడు." (ఖుర్ఆన్ 25 : 2)

దివ్యఖుర్ఆన్‌లోని మరో ఆయతు వాస్తవ దైవభావన గురించి ఇలా తెలుపుతోంది:

"వారు అల్లాహ్‌ను వదలి (బూటకపు) దేవుళ్లను కల్పించుకున్నారు. వారు (అంటే ఆ బూటకపు దేవుళ్లు) ఏ వస్తువునూ సృష్టించలేరు. పైగా వారు స్వయంగా సృష్టించ బడినవారు. వారు తమ స్వయానికి సైతం లాభనష్టాలు చేకూర్చుకునే అధికారం కలిగిలేరు. జీవన్మరణాలు కూడా వారి అధీనంలో లేవు. (మరణానంతరం) తిరిగి లేచే శక్తి కూడా వారివద్ద లేదు"

(ఖుర్ఆన్ 25 : 3)

దివ్యఖుర్ఆన్‌లోని ఇంకో ఆయతు నిజదేవుని లక్షణాలను వివరించి, ఆయన ఒక్కడే ఆరాధనలకు ఏకైక అర్హుడని తేల్చి చెప్పింది:

"అల్లాహ్ (మాత్రమే నిజానికి ఆరాధ్య దైవం). ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేనే లేడు. ఆయన సజీవుడు; అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునుకు గానీ, నిద్రగానీ పట్టదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగల వాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనుక ఉన్నదానిని కూడా ఆయన ఎరుగు. ఆయన కోరినది తప్ప ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్య పరిధిలోకి రాదు. ఆయన కుర్చీ వైశాల్యం

భూమ్యాకాశాలను పరివేష్టించి ఉంది. వాటిని రక్షించటానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు." *(ఖుర్ఆన్ 2 : 255)*

"అల్లాహ్‌యే ఆకాశాలనూ, భూమినీ, వాటి మధ్యనున్న సమస్తాన్నీ ఆరు రోజులలో సృష్టించాడు. ఆ తరువాత సింహాసనాన్ని (అర్షును) అధిష్ఠించాడు. ఆయన తప్ప మీకు ఏ సహాయకుడూ, మరే సిఫారసు చేసే వాడూ లేడు. అయినా మీరు హితబోధను గ్రహించరేమిటీ?" *(ఖుర్ఆన్ 32 : 4)*

దీని గురించి ఆలోచించండి.

**మనకు ఆహారం ప్రసాదిస్తున్నది ఆయన.**

**భూమ్మీద మనుగడ సాగించటానికి అవసరమైన ప్రతి వస్తువును మనకు ప్రసాదిస్తున్నది ఆయన.**

**ఆయనకు దాహం వేయదు, ఆకలి అసలే ఉండదు. ఆహారం తీసుకుంటేనే ఆయన మనుగడ సాగుతుందన్న విషయం కూడా ఏమీ లేదు.**

సాధారణంగా జనం దేవునికి నైవేద్యం సమర్పించుకుంటారు. నైవేద్యాన్ని విగ్రహాల ముందు ఉంచి దేవతల ద్వారా అది స్వీకరించబడుతుందనీ, తమ కోరికలు నెరవేరుతాయని వారు భావిస్తారు.

### కాని వాస్తవం ఏమిటో తెలుసా? ఆ విగ్రహాలు తినలేవు. కనీసం వాసన కూడా చూడలేవు.

మతగ్రంథాలు మానవాళికి నిజమైన మార్గదర్శకాలు. అవి ఇలాంటి అజ్ఞాన పోకడలన్నింటిని ఖండిస్తాయి. నిజమైన సృష్టికర్త, విశ్వ ప్రభువుకే ఆరాధనలను అంకితం చేసుకోమని మనిషికి ప్రబోధిస్తాయి. మానవమాత్రుల మాటలకు, భావాలకు, తత్వాలకు ప్రభావితులై అపమార్గాన పడవద్దనీ, అపనమ్మకాలతో, మూఢ వైఖరితో జీవించవద్దని హితవు పలుకుతాయి.

మనిషి సన్మార్గంపై నడవాలి. అతను ఈ భూమ్మీద దేవుడు సూచించిన వాస్తవమైన పద్ధతిలో జీవించాలి. అందుకే ఆకాశగ్రంథాలు అవతరించాయి. దేవుని తరఫున అవతరించిన ప్రవక్తలు కూడా అదే మార్గంలో ఆకాశ గ్రంథాల్లోని సందేశాన్ని ప్రచారం చేశారు. ప్రవక్తలు సామాన్య ప్రజలకు జీవిత వాస్తవాలను, సృష్టి నిజాలను





తెలియపరచటంలో ఈ గ్రంథాలు ఎంతో ఉపకరించాయి. ఆ ఆకాశగ్రంథాల బోధనలకు అనుగుణంగా నడుచుకున్నవారే ఇహలోకంలోనూ, పరలోకంలోనూ విజయం సాధించ గలుగుతారు. ఇహపర లోకాలలో ముక్తికి ఏకైక మార్గం అదే.

### మరి అలాంటప్పుడు ఆకాశ గ్రంథాలు చూపించిన మార్గంలో జీవితం గడపవలసిన అవసరం లేదంటారా?

దైనందిన జీవితంలో మనం ప్రతి విషయం గురించి ఎంతో ఆలోచిస్తాం. ఐహిక జీవితానికి సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకోవాలంటే ఒకటికి పలుమార్లు పరిశీలించుకుంటాం. ఆ రంగానికి సంబంధించిన నిపుణుల దగ్గర సలహాలు కూడా తీసుకొంటాం. అందుకోసం అవసరమైన ప్రతి చోటకూ పరిగెత్తుతాం. ప్రాపంచిక విషయాల్లోనయితే మనం చాలా జాగ్రత్తగా ఉంటాం.

కాని దురదృష్టం ఏమిటంటే ఆధ్యాత్మిక జీవిత విషయాల్లో మనం నిర్లక్ష్యం పాటిస్తాం. అసలు వాటికి చాలా తక్కువ ప్రాముఖ్యత ఇస్తాం. మరి నిజానికి ఆ జీవితం శాశ్వతమైనది. అన్ని దివ్యగ్రంథాలూ ప్రస్తావించిన **పరలోక జీవితం** అదే!

సర్వశక్తిమంతుడైన దేవుడు మనకు ఆలోచించటానికి బుద్ధిని ప్రసాదించాడు. ఆచి తూచి నిర్ణయాలు తీసుకునే స్పృహను అనుగ్రహించాడు. ఆయన ఈ విశ్వాన్నంతటినీ సృష్టించాడు. మానవులను పరీక్షించటానికి వారిని ఈ భూమ్మీద వసింప జేశాడు.

ఏకైక ప్రభువు నిర్మించిన ఈ విశ్వంలో ఒకే రకమైన ప్రకృతి నియమాలు సర్వవ్యాపితమై ఉన్నాయి. ఒకసారి వాటిమీద యోచన చేయండి. తమను సృష్టించిన నాటి నుంచే సూర్యుడు, చంద్రుడు, భూమి ఒక్క క్షణమైనా ఆగకుండా తిరుగుతూ పోతున్నాయి. అవి తమ కర్తవ్యాన్ని ఏనాడు తప్పలేదు. తూర్పున ఉదయించి పడమటను అస్తమించటం సూర్యుని విధి. అది ఏనాడు తన విధిని అతిక్రమించలేదు. అలాగే అంతరిక్షంలోని గ్రహాలు, నక్షత్రాన్నీ కూడా సక్రమంగా నిర్మించబడ్డాయి. తమ ప్రభువు తమ కొరకు నిర్ణయించిన ప్రకృతి చట్టాలను అవి నిక్కచ్చిగా అనుసరిస్తున్నాయి.

ప్రకృతిపై యోచన చేసి, సత్యాన్ని గ్రహించాలని దాదాపు అన్ని దివ్యగ్రంథాల్లోనూ పరమ ప్రభువు పదేపదే నొక్కివక్కాణించడం జరిగింది.

ఓ దివ్యఖుర్ఆన్ వాక్యంలో ఈ విధంగా చెప్పబడింది:

"ఏమిటి, ఒంటెలు ఎలా సృష్టించ బడ్డాయో వారు చూడటం లేదా?
ఆకాశం ఎలా ఎత్తుగా చేయబడిందో వారు గమనించటం లేదా?
పర్వతాలు ఎలా పాతిపెట్టబడ్డాయో తిలకించటం లేదా?
భూమి ఎలా (విశాలంగా) పరచబడి ఉన్నదో వారు వీక్షించటం లేదా?
కనుక (ఓ ప్రవక్తా!) నీవు మాత్రం బోధపరుస్తూ ఉండు. నీవు హితబోధ చేసే వాడివి మాత్రమే." (ఖుర్ఆన్ 88 : 17 – 21)

కాని దురదృష్టం ఏమిటంటే మానవులు అమాయకత్వానికీ, అజ్ఞానానికి గురయ్యారు. ఈ అజ్ఞానమే మనిషిని అపసవ్యమైన, అనుచితమైన వైఖరి వైపుకు లాక్కెళుతున్నది.

**నా ప్రియ స్నేహితులారా!**

తోటి మానవుల సంక్షేమాన్ని కోరే ఓ శ్రేయోభిలాషిగా నేను మిమ్మల్ని మనవి చేసుకుంటున్నాను. దీని గురించి మీరు మరో మారు ఆలోచించండి. మళ్లీ మళ్లీ ఆలోచన చేయండి. ఎట్టి పరిస్థితిలోనూ సత్యానికి దూరం కాకండి. ఆలోచించి సత్యాన్ని గ్రహించగల బుద్ధిజ్ఞానాలను దేవుడు మనకు ఇచ్చాడు. ఈ దివ్య మార్గ దర్శకాలు అందజేస్తున్న నిజాల గురించి యోచన చేయండి. వాటిని క్షుణ్ణంగా చదవండి. బాగా అధ్యయనం చేయండి. వాటి లోతుల్లోకి వెళ్ళి పరిశీలించండి. సూక్ష్మంగా ఆలోచించండి. అప్పుడు శాస్త్రీయమైన, అత్యంత సహేతుకమైన ఒక ఆలోచన మన మేధో లోకంలో ప్రతిఫలించవచ్చు. సత్యానికి సంబంధించిన ఓ చిరుదివ్వె మన అంతరాత్మలో వెలగవచ్చు.

**సత్యం విజయానికి నాంది పలుకుతుంది. సత్యం సుగుణమే అది!**
**అసత్యం అపజయానికి దారితీస్తుంది.**
**ఎందుకంటే అంతం అసత్యపు గుణం కనుక!**

ఇప్పుడు మనం ఇంకో అడుగు ముందుకేసి దివ్యగ్రంథాల వెలుగులో దేవుని ఏకత్వాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిద్దాం. ఈ పుస్తకంలో పేర్కొనబడిన సాక్ష్యాధారాలన్నీ దివ్యగ్రంథాల్లోనివి, ఇంకా అవి ధృవీకరించ బడినవీనూ!





## 3. హిందూ మతంలో దైవభావన

### 1. హిందూ ప్రజానీకంలో దైవ భావన

సాధారణంగా హిందూమతం అంటేనే బహుదైవత్వ మతంగా భావించ బడుతుంది. చాలామంది హిందువులు తాము అనేకమంది దేవుళ్ళపై విశ్వాసం కలిగివుండటం చేత ఈ విషయాన్ని నిస్సంకోచంగానే ఒప్పుకుంటారు. కొంతమంది హిందువులు ముగ్గురు దేవుళ్ల భావనలో విశ్వాసం కలిగి ఉంటారు. కొందరు ముక్కోటి దేవతలను ఆరాధిస్తారు. ఇంకొందరికి ముప్పై మూడు కోట్ల దేవతలపై విశ్వాసం. అయితే **విద్యావంతులైన హిందువులు, తమ దివ్య గ్రంథాలను బాగా అధ్యయనం చేసిన హిందువులు మాత్రం కేవలం ఒకే ఒక్క దేవుణ్ణి మాత్రమే విశ్వసించాలని, ఆయన్నే ఆరాధించాలని బల్ల గుద్ది చెబుతారు.**

దేవుణ్ణి అర్థం చేసుకోవటంలో ముస్లింలకు – హిందువులకు మధ్య ఉన్న భేదాన్ని చాలా సులభంగా గుర్తించవచ్చు. భగవంతుడు – సృష్టి, రెండూ వేరువేరు కావని హిందువులు భావిస్తారు. వారి ప్రకారం సృష్టిలోని ప్రతి వస్తువు, అది సజీవమైనదైనా, నిర్జీవమైనా సాక్షాత్తు అది భగవత్ స్వరూపమే! కనుకనే సగటు హిందువు **ప్రతి వస్తువునూ దేవునిగా తలుస్తాడు.** అతని దృష్టిలో చెట్లు పుట్టలు, రాళ్లు రప్పలు, చంద్రుడు, సూర్యుడు, కోతులు, పాములు అన్నీ భగవత్ స్వరూపాలు. చివరికి మనిషి కూడా దైవాంశమే!

ఇస్లాం బోధన ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. మనిషి తననూ, తన చుట్టుప్రక్కల ఉన్న వస్తువులను కేవలం 'దేవుని సృష్టి'గా మాత్రమే చూడాలని ఇస్లాం ధర్మం చెబుతుంది. అవి భగవత్ స్వరూపాలు ససేమిరా కావంటుంది. అందుకని ముస్లింలు సృష్టిలోని **వస్తువులన్నిటినీ దేవుడు సృష్టించినవిగా మాత్రమే గుర్తిస్తారు.** మరోమాటలో చెప్పాలంటే సృష్టి మొత్తం దేవునికి చెందినదని ముస్లింల నమ్మకం. చెట్లుపుట్టలు, రాళ్లురప్పలు, సూర్యచంద్రులు, కోతులు, పాములు, మనుషులు **అందరూ దేవునికి చెందినవారు, దేవుని దాసులు.**

### 2. హిందూ మత గ్రంథాల ప్రకారం దేవుని భావన

హిందూ మతగ్రంథాలను పరిశీలిస్తే వాస్తవానికి హిందూ మతంలో దైవభావన ఏమిటో మనకు అర్థం అవుతుంది.

## భగవద్గీత

హిందూ మత గ్రంథాలన్నిటిలో కెల్లా ప్రఖ్యాతిగాంచినది భగవద్గీత.

'గీత'లోని ఈ క్రింది వాక్యాన్ని గమనించండి.

"ఎవరి బుద్ధినయితే భౌతిక వాంఛలు ఆవహిస్తాయో వారు చిల్లర దేవుళ్లకు ఆత్మ సమర్పణ చేసుకుంటారు. ఇంకా స్వయం కల్పిత ఆరాధనా విధానాల ద్వారా ప్రత్యేక నియమాలను, నిబంధనలను అనుసరిస్తారు."

(భగవద్గీత 7 : 20)

భౌతికవాదులైన ప్రజలు నిజదేవుణ్ణి వదలి మిథ్యాదేవుళ్లను పూజిస్తారని పై భగవద్గీత వాక్యం చెబుతోంది.

"కామము, క్రోధము, లోభము అను ఈ మూడును మూడు విధములగు నరక ద్వారములు. ఇవి జీవునకు నాశనము కలుగజేయును. కాబట్టి ఈ మూడింటిని విడనాడవలెను." (భగవద్గీత 16 : 21)

దేవుడు అవతరింపజేసిన గ్రంథాలను మనం చదవాలి. ఆ గ్రంథాల్లో దేవుడు ఇచ్చిన ఆజ్ఞలకు అనుగుణంగా మనం జీవితం గడపాలి. మనోవాంఛలకు దాసులై జీవించకూడదు. ఇదే గీతోపదేశం. క్రింద పేర్కొనబడిన భగవద్గీత వాక్యాలను గమనించండి:

"ఎవడు శాస్త్రోక్తమగు విధిని విడిచిపెట్టి తన ఇష్టము వచ్చినట్లు ప్రవర్తించునో అట్టివాడు పురుషార్థ సిద్ధిని గాని సుఖమును గాని ఉత్తమ గతియగు మోక్షమును గాని పొందనేరడు." (భగవద్గీత 16 : 23)

ఆ తర్వాతి వాక్యం ఇలా అంటోంది:

"ఏది చెయ్యవచ్చు? ఏది చేయకూడదు అన్న కార్యాకార్య విచక్షణలో శాస్త్రమే నీకు ప్రమాణం! శాస్త్రప్రమాణంగా చెప్పబడినది ఏదో విశదంగా తెలుసుకో! అలా, శాస్త్రోక్తమైన కర్మలనే ఆచరించి కార్యాకార్యములు తెలిసి ఉత్తమగతిని పొందు." (భగవద్గీత 16 : 24)





## ఉపనిషత్తులు

హిందువులు ఉపనిషత్తులను తమ పవిత్ర గ్రంథాలుగా భావిస్తారు.

ఈ క్రింద పేర్కొనబడిన ఉపనిషత్ సూక్తులు దైవత్వ భావనను విశదీకరిస్తున్నాయి:

"యేకం యెవద్వితీయం"

**"ఆయన ఒక్కడు. ఆయన తప్ప మరొకడు లేడు."**

(చందోగ్య ఉపనిషత్ 6 : 2 : 1)

"న చాస్యకశ్చిజ్జనితా న చాధిపః"

**"ఆయనకు తల్లిదండ్రులు లేరు. ఆయనకు ప్రభువు లేడు."**

(శ్వేతశ్వతరోపనిషత్ 6 : 9)

ఉపనిషత్తుల్లోని ఇంకో సూక్తి విశ్వ ప్రభువు ఏకత్వాన్ని ఇలా చాటిచెప్పింది:

"న తస్య ప్రతిమ అస్తి"

**"ఆయనకు సాటి సమాన రూపము ఏదీ లేదు."**

(శ్వేతశ్వతరోపనిషత్ 4 :19)

దేవుని రూపాన్ని ప్రత్యేకంగా వర్ణించటం అసాధ్యమని ఉపనిషత్తుల్లోని ఈ క్రింది వాక్యాలు ఘోషిస్తున్నాయి:

**"న సంద్రుశే తిష్టతి రూపమస్య నచక్షుషాపశ్యతి కశ్చనైనమ్"**

"దేవుని రూపం ఇంద్రియాల పరిధిలో నిలువదు. కన్నులతో ఆయన్ను ఎవరూ చూడలేరు." (శ్వేతశ్వతరోపనిషత్ 4 :20)

## వేదాలు

హిందూ మత గ్రంథాలన్నిటిలోనూ వేదాలు అత్యంత పవిత్రమైనవిగా, పుణ్యప్రదమైనవిగా భావించబడతాయి. ప్రధానంగా నాలుగు వేదాలు ఉన్నాయి.

**1.రుగ్వేదం, 2.యజుర్వేదం, 3.సామవేదం, 4.అధర్వణవేదం**

### 1. ఋగ్వేదం

**ఋగ్వేదం వేదాలన్నింటిలో ప్రాచీనమైనది.** హిందువుల చేత అత్యంత పవిత్రంగా భావించబడే మతగ్రంథాల్లో ఒకటి. ఋగ్వేదంలో ఇలా ఉంది.

"దేవుడు ఒక్కడే. పండితులు ఆయన్ను వేరువేరు నామాలతో పిలిచారు."

*(ఋగ్వేదం 1 : 164 : 46)*

రుగ్వేదం సర్వశక్తిమంతుడైన దేవుని గురించి ఎన్నో విభిన్నమైన లక్షణాలను వివరిస్తుంది. రుగ్వేదం 2వ పుస్తకంలో అలాంటివి చాలా ప్రస్తావించబడ్డాయి.

ఉదాహరణకు **"బ్రహ్మ"** అనేది రుగ్వేదంలో దేవుని గురించి ప్రస్తావించబడిన లక్షణాల్లో ఒకటి. **బ్రహ్మ అంటే "సృష్టికర్త"** అని అర్థం. దాన్ని అరబీలోకి అనువదిస్తే **"ఖాలిఖ్"** అవుతుంది. సర్వశక్తివంతుడైన ఆ దేవుణ్ణి **"ఖాలిఖ్"** అని పిలిచినా, **"సృష్టికర్త"** అని పిలిచినా, **"బ్రహ్మ"** అని పిలిచినా ఆయనకు అభ్యంతరం ఉండదు. అలాగాకుండా నాలుగు తలలు కలిగివుండి, కిరీటాలు ధరించి ఉండే బ్రహ్మ స్వరూపాన్ని ఊహించుకొని ఆయనే సర్వశక్తిమంతుడైన దేవుడు అని అంటే మాత్రం దేవుడు దాన్ని ససేమిరా ఆమోదించడు. ఆ పిలుపు నూటికి నూరుపాళ్లు దైవ ప్రబోధనలను కాలరాయటం క్రిందికే వస్తుంది.

రుగ్వేదంలోని ఈ క్రింది వాక్యం దేవుని ఏకత్వాన్ని, ఆయన ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది.

"ఆ దేవుడిని తప్ప మరెవరినీ పూజించకండి. ఆయన మాత్రమే దేవుడు. ఆయన్నే స్తుతించండి." *(ఋగ్వేదం 8 :1 :1)*





"దేవశ్య సమితుక్ పరిష్తుతిహి:"

**"సమస్త సృష్టిని సృష్టించినవానికే సకల స్తోత్రాలు."** *(ఋగ్వేదం 5 : 1 : 81)*

"ఓ దేవా! నీవు అందరి మిత్రుడవు. అందరికంటే పవిత్రుడవు. విశ్వ పాలకుడివి. మా మీద కరుణజూపు. నీవు సర్వాధిక్యుడవు. విశ్వానికి ప్రభువువి. అందరికి ఆధారభూతుడవు. మాకు జ్ఞానాన్ని, శక్తియుక్తులను అనుగ్రహించు. ఓ సర్వశక్తిమయా! సర్వాధిక్యుడా! మా అందరిపై కారుణ్యాన్ని కురిపించు."

*(ఋగ్వేదం 1)*

"ఒక్కడే అయిన సృష్టికర్తను పండితులు విభిన్న నామాలతో పిలుస్తారు. అగ్ని, యమ, మిత్ర అంటారు. ఆయననే ఇంద్రుడు అని కూడా పిలుస్తారు. ఆయన సమస్తమూ తెలిసిన జ్ఞాని మరియు సర్వోన్నతుడు."

*(ఋగ్వేదం 1 : 164 : 46)*

"సర్వవాపకుడు, శాశ్వితుడు, అత్యంత పవిత్రుడు, భూమికి, సూర్యునికి ఆధార భూతుడు అయిన ఘనుడిని గుర్తించనివారికి వేదాలు ఏం లాభం కలుగ జేస్తాయి? అటువంటివారు నాస్తికులు. మందమతులు. ఎల్లప్పుడు దుఃఖ సాగరంలో మునిగివుంటారు. అతనిని గుర్తించినవారే సుఖంగా ఉంటారు."

*(ఋగ్వేదం 1 : 164 : 39)*

"ఓ మనుష్యులారా! సూర్యుడు మొదలగు సర్వతేజోమయ పదార్థాలకు ఆధారభూతుడు, పుట్టిన జగతికి, పుట్టబోయే జగతికి అద్వితీయ స్వామి అయిన పరమాత్మ ఈ జగతి పుట్టక ముందు కూడా ఉండేవాడు. ఈ పృథివి మొదలుకుని సూర్యుని వరకు విశ్వమంతటినీ ఆయనే సృష్టించాడు. ఆ పరమాత్మను ప్రేమించాలి. ఆయన్నే పూజించాలి."

*(ఋగ్వేదం 10: 121: 1)*

"ధార్మికులు, విద్వాంసులు, నిస్వార్థపరులు, పుణ్యాత్ములను ఆర్యులంటారు. వీరికి భిన్నమైనవారిని దస్యులు – అనగా దొంగలు, దుష్టులు, అధార్మికులు, అవిద్వాంసులు అంటారు." *(ఋగ్వేదం 1 : 51 : 8)*

"రాత్రింబవళ్ల నియమాన్ని విధించినవాడు ఆయనే. (చూపు వున్న వాటికే కాదు) దృష్టిరహిత సమస్త పదార్థాలకు ఆయనే ప్రభువు. మహోన్నతుడైన ఈ సృష్టికర్తయే సూర్యచంద్రాదులను తమ తమ విధి నిర్వహణకై ఉనికిలోకి తెచ్చాడు. కార్యాకారణ సంబంధంగా భూమ్యాకాశాల నిర్మాణం చేశాడు. వాతావరణాన్ని ఉనికిలోకి తెచ్చాడు. జ్ఞానజ్యోతిని అందించాడు."

*(ఋగ్వేదం 10 : 190 : 2-3)*

"ఓ ప్రభూ! నీవు విశ్వానికి, వేదాలకు రక్షణకర్తవు. పవిత్రుడవు. సర్వశక్తిమంతుడవు. ఇంద్రియాలపై నిగ్రహం కలిగివుండి, సత్యం పలికి, తనలోని పశుత్వంపై విజయం సాధించి, అంతర్గత నికృష్ట స్వభావాన్ని లోబరచుకోలేని ఏ మానవ ఆత్మా నీ వద్దకు చేరజాలదు." *(ఋగ్వేదం 9 : 83 : 1)*





### హిందూ మత బ్రహ్మ సూత్రం

హిందూమతంలోని బ్రహ్మసూత్రం ఇది:

**"ఏకం బహ్మాం, ద్వితీయ నాస్తి , నెహ్‌న నాస్తి కించన్"**

**అర్థం :**

"దేవుడు ఒక్కడే, రెండవ వాడు లేడు, అస్సలు లేడు, అస్సలు లేడు, కొంచెం కూడా లేడు"

నిజదైవం తప్ప మరో దేవుడు లేడని పైన పేర్కొనబడిన ఋగ్వేద మంత్రాలు చాలా స్పష్టంగా ఘోషిస్తున్నాయి. ఆయన మరెవరో కాదు. ఈ మొత్తం విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్తే ఆ నిజదేవుడు. కనుక మనం నిజదైవం స్థానంలో వేరొకర్ని ఆరాధించే ముందు దీనిగురించి చిత్తశుద్ధితో యోచించాలి.

మన కర్మలు దేవుడు అవతరింపజేసిన గ్రంథాల ప్రబోధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నప్పుడు మనం సన్మార్గంలో ఉన్నామని ఎలా చెప్పగలం? పరలోకంలో ముక్తి పొందగలమని ఎలా ఆశించగలం? చెప్పండి.

ఎటువంటి పక్షపాతానికి లోనుకాకుండా హిందూ ధర్మ గ్రంథాలను అధ్యయనం చేసినప్పుడు మాత్రమే హిందూ మతంలోని వాస్తవ దైవ భావనను మనం అర్థం చేసుకోగల్గుతాము సుమా!

## 2. యజుర్వేదం

యజుర్వేదంలోని ఈ క్రింది వాక్యం కూడా అలాంటి దైవత్వపు భావాన్నే వివరిస్తోంది. సర్వశక్తిమంతుడైన దేవుణ్ణి మానవ శరీరాలతో అభివర్ణించటాన్ని కూడా యజుర్వేదంలోని ఈ క్రింది సూక్తులు ఖండిస్తున్నాయి:

"న తస్య ప్రతిమ అస్తి"

**" ఆయనకు పోలిక ఎవరూ లేరు."** *(యజుర్వేదం 32 : 3)*

**"విష్ణువు"** అనేది ఋగ్వేదంలో దేవుని గురించి ప్రస్తావించబడిన మరో అందమైన గుణం. ఇది ఋగ్వేదం రెండవ పుస్తకంలో ఉంది. **'విష్ణువు'**ను మన భాషలోనయితే **"ప్రభువు"** అని చెప్పుకోవచ్చు. దాన్నే అరబీ భాషలోకి అనువదిస్తే **"రబ్బ్"** అవుతుంది.

ఆ శక్తిమాన్యుడైన దేవుణ్ణి 'రబ్బ్' అని పిలిచినా, **"ప్రభువు"** అని పిలిచినా, లేక **"విష్ణువు"** అని పలికినా ఆయనకు అభ్యంతరం ఉండదు. కాని **'విష్ణువు'** అనగానే సామాన్య ప్రజల ఊహల్లోకి ఒక ప్రత్యేకమైన ఆకారం వస్తుంది. ఆ ఆకారానికి నాలుగు చేతులుంటాయి. ఒక కుడి చేతిలో చక్రం ఉంటుంది. ఒక ఎడమ చేతిలో శంఖం ఉంటుంది. ఆ ఆకారం ఒక పక్షిమీద స్వారీ చేస్తూ ఉంటుంది. లేక ఆ ఆకారం చుట్ట వేసుకొని ఉన్న ఒక పెద్ద పాము మీద పడుకొని ఉంటుంది. విష్ణువు అని చెప్పి ఆ విధంగా ఊహించుకోవటానికి మాత్రం అస్సలు అనుమతి లేదు. అలా చేయటాన్ని నిజదైవం ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించదు. ఇంతకు ముందు చెప్పబడినట్లు **ఇది శ్వేతాశ్వతర ఉపనిషత్తు 4వ అధ్యాయం 19వ వాక్యానికి విరుద్ధం.**

"న తస్య ప్రతిమ అస్తి"

**"ఆయనకు పోలిక ఎవరూ లేరు."** *(యజుర్వేదం 32 : 3)*

"షధామ పోప్విధమ్"

**"ఆయనకు శరీరము లేదు. ఆయన పరిశుద్ధుడు."** *(యజుర్వేదం 40 : 8)*

"అంధః తమ ప్రవిషన్తి యె అసంభుతి ముపస్తే"

**"ఎవరైతే ప్రాకృతిక వస్తువులను (గాలి, నీరు, మొ॥ వాటిని) పూజిస్తారో వారు చీకటి (నరకం)లో ప్రవేశిస్తారు. ఎవరైతే సంభుతి (సృష్టితాలు - మానవుని చేత తయారయ్యే వస్తువులు, బొమ్మల)ని పూజిస్తారో వారు మరింత అంధకారంలో ప్రవేశిస్తారు."** *(యజుర్వేదం 40 : 9)*

"అప్పుడు విరాట్‌ను సృష్టించటం జరిగింది."

"ఆ తర్వాత భూమి సృష్టించబడింది." *(యజుర్వేదం 31)*

"ఆదిలో హిరణ్యగర్భ్య, అనగా ఏకైక సృష్టికర్త ఉన్నాడు. ఆయన సూర్యుణ్ణి, భూమిని పోషిస్తున్నాడు. శుభప్రదమైన ఆయన్ని మేము ప్రస్తుతిస్తున్నాము."

*(యజుర్వేదం 13 : 4)*





## గాయత్రి మంత్రం వాస్తవికత

**ఓం భూర్భు వత్సువః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్**

"ఓ దేవా! ఓ సచ్చిదానందా! ఓ నిత్యశుద్ధుడా! శుభప్రదమైనవాడా! జన్మ మరణాది క్లేశరహితుడా! నిరాకారుడా! సర్వజ్ఞుడా! అన్నీ ఎరిగినవాడా! ప్రభువా! విశ్వ పాలకుడా! ఓ సర్వాంతర్యామీ! ఓ కృపా సాగరా! నీవు విశ్వానికి జీవానివి. నీవు శుభప్రదమైనవాడివి. మా దుఃఖాలను, బాధలను చెరిపేయటానికి నీ ఒక్క చూపు చాలు. నీవు విశ్వానికి ప్రభువువి. సర్వ సృష్టికర్తవి. నీ పవిత్ర ఆధికృతను గూర్చి నీకు యోగ్యమైన రీతిలో నిన్ను ప్రస్తుతించుదుమా?! నీవు మా బుద్ధికి సరైన మార్గం చూపేటందుకు. నీవు మా దేవుడివి. మా స్తోత్రానికి, మా పూజకు ఏకైక అర్హుడివి. నీకు సరిసమానమైనవాడు, నీకంటే ఉన్నతమైనవాడు మరెవడూలేడు. నీవే మా సృష్టికర్తవు. పాలకుడవు. న్యాయ కారివి. నువ్వు మాత్రమే సంతోషాన్ని ప్రసాదించగలవు."

*(యజుర్వేదం 36 : 3)*

ప్రియ మిత్రులారా!

పై వేద మంత్రంలో చాలా స్పష్టంగా చెప్పటం జరిగింది. **దేవుడు ఒకే ఒక్కడు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు. మనం ఆయన్నొక్కణ్ణే పూజించాలి. ఆరాధించాలి.**

ఇక్కడ **గాయత్రి మంత్రం** గురించి మరికొద్దిగా తెలుసుకుందాము. నిజానికి ఇదో వేద వాక్యం (యజుర్వేదం, 36వ అధ్యాయం, 3వ వాక్యం అన్నమాట). అసలు **"గాయత్రి"** అనేది ఒక సంస్కృత పదం. 'గాయ' మరియు 'అత్రి' అనే రెండు పదాలతో ఈ పదం సృజించబడింది.

**గాయ :** అంటే గొంతు నుండి వెలువడే స్వరం

**అత్రి :** అంటే స్తుతి

ఆ విధంగా **"గాయత్రి"** అంటే **మన స్వరంతో విశ్వ ప్రభువును స్తుతించటం** అన్నమాట. ఈ మంత్రంలో దేవుడు సత్యాన్ని తేటతెల్లం చేస్తున్నాడు. **తన ఉనికికి ఒక ప్రత్యేక రూపం అంటూ ఏమీ లేదని** ఆయన స్వయంగా ఈ మంత్రంలో ప్రకటించాడు. కాని ప్రజలు ఈ సత్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇంకా ప్రజలు చేస్తున్న మరో ఘోరం ఏమిటంటే, 'గాయత్రి'ని వారు స్త్రీ రూపంగా భావించి ఆమెను ఆరాధిస్తున్నారు. కనుక **"గాయత్రి"** అనేది ఓ మిథ్యాదైవం. నిజదేవుని స్థానంలో ప్రజలు ఊహించుకుంటున్న ఓ కల్పితదైవం. మనుషులు చేస్తున్న ఈ అనాచారాన్ని సర్వశక్తిమంతుడైన దేవుడు ఎంతవరకు క్షమిస్తాడు?!

"మహోన్నతుడైన పరిపాలకుని చేత ఈ విశ్వం సృజించబడింది, ఈ పూర్తి ప్రకృతి పరిధిలోని ప్రతి ప్రపంచం కూడాను. ఆయన నిజదేవుడు. ఆయనకు భయపడండి. మానవులారా! ఏ సృష్టి ఉనికి సంపదనూ అన్యాయంగా దాచకండి. అన్యాయమైన ప్రతి విషయాన్నీ తిరస్కరించండి. స్వచ్ఛమైన ఆనందాన్ని అనుభవించండి." *(యజుర్వేదం 40 : 1)*

"ఓ మానవులారా! దేవుడు సృష్టికి పూర్వం కూడా ఉన్నాడు. సూర్యుడు మొదలగు తేజోవంతమైన లోకాల ప్రభువు, ఆధారభూతుడు ఆయన. సృష్టించబడినదానికి, సృష్టించబోయేదానికి యజమాని. అప్పుడూ ఉండేవాడు. ఇప్పుడూ ఉన్నాడు. ఎప్పటికీ ఉంటాడు. పృథివి మొదలుకొని సూర్యలోకము వరకు ఆయన సమస్తాన్నీ సృష్టించి వాటిని పోషిస్తున్నాడు. శాశ్వత శుభప్రదమైన అస్తిత్వం ఆయనది. మేము చేస్తున్నట్లు మీరందరు కూడా ఆయన్నే ప్రస్తుతించాలి." *(యజుర్వేదం 13 : 4)*

"ఆయన ఎన్నడునూ ఏ శరీరంతోనూ అవతరించలేదు. ఆయన ఎన్నడునూ జన్మించలేదు. ఆయన ఎన్నడూ విభజించబడడు. వేర్వేరు కాదు. శరీరావయవాలు, నరాల వ్యవస్థకు అతీతుడాయన. ఆయన ఎన్నడూ ఏ తప్పూ చేయడు. ఆయనకు బాధ కలగదు. దుఃఖం అంటదు. అజ్ఞానం లాంటి అవగుణాలు ఆయనవి కావు." *(యజుర్వేదం 30 : 8)*





"విశ్వపు అతి గొప్ప పాలకుడు స్వయం ఉనికి గలవాడు. సర్వాంతర్యామి. శుద్ధుడు. నిత్యుడు. నిరాకారుడు. అవినాశులైన తన ప్రజకు ఆయన ఆది నుంచే మార్గదర్శకత్వం వహిస్తూ వస్తున్నాడు. వారి ప్రయోజనార్థం వేదాల ద్వారా ప్రతి విద్యనూ వారికి బోధిస్తున్నాడు." *(యజుర్వేదం 40 : 8)*

"మానవులారా! సర్వంలో వ్యాపించే శక్తి మాత్రమే అవినాశనమైన ప్రకృతికి ప్రభువు. అది ప్రపంచానికి భౌతిక, ఆధ్యాత్మిక కారకం. అయినప్పటికీ ఆ రెండిటి కంటే వేరైనది. ఆయన విశ్వ సృష్టికర్త. ఆయనే గతం. ఆయనే వర్తమానం. ఆయనే భావికాలం. విశ్వంలోని వస్తువులన్నిటినీ సృష్టించి వాటిని పరిపోషిస్తున్న ఏకైక అత్యున్నత శక్తి అది." *(యజుర్వేదం 21 : 2)*

"దేవుడు, ఆయనే (సూర్యుడు లాంటి) తేజోమయ వస్తువులను, ఇంకా (భూమి లాంటి) నిస్తేజ వస్తువులను సృష్టించి వాటిని పరిపోషిస్తున్నవాడు." *(యజుర్వేదం 13 : 4)*

"ఈ భూమి తన యావత్ జలముతో సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నది." *(యజుర్వేదం 33 : 43)*

"సర్వాంతర్యామి అయిన దేవునికి బదులు శాశ్వత ప్రకృతిని – ప్రపంచపు భౌతిక కారణాన్ని– పూజించేవారి చుట్టూ అంధకారం ఉంది. ఇంకో మాటలో చెప్పాలంటే వారు అజ్ఞానంలో మునిగి వున్నారు. బాధా సముద్రపు అట్టడుగున చిక్కుకొని ఉన్నారు. ఇక నిజదేవుణ్ణి వదలిపెట్టి ప్రకృతి నుంచి పుట్టిన, కంటికి కనిపించే భూమి, చెట్లు, (మానవ లేక ఇతర) దేహాలు మొదలగు వాటిని పూజించేవారయితే అంతకన్నా అంధకారంలో ఉన్నారు. మరో మాటలో చెప్పాలంటే వారు మహా మూర్ఖులు. వారు భయంకరమైన నరకంలో పడతారు. అందులో సుదీర్ఘ కాలం పాటు దుఃఖాన్ని, బాధలను, కష్టాలను అనుభవిస్తూ ఉంటారు." *(యజుర్వేదం 40 : 9)*

"ఆయనకు శరీరము లేదు. ఆయన పరిశుద్ధుడు. ఆయనకు పోలిక ఎవరూ లేరు. ఆయనకు పుట్టుక లేదు. కనుక పూజకు అర్హుడు." *(యజుర్వేదం 40 : 8 మరియు 32 : 3)*

"ఓ ప్రభూ! పరిపూర్ణ దివ్యత్వం గలవాడా! మేధావులు, పండితులు, యోగులు ప్రార్థించే బుద్ధి కుశలతను మాకు ఇప్పుడే, ఈ క్షణాన్నే ప్రసాదించు."

(యజుర్వేదం 32 : 14)

"నీవు జ్యోతివి. నాపై కరుణజూపు. ఈ జ్యోతిని నా హృదయంలో ప్రసరింపజేయి. నీవు అనంత శక్తివి. నీ కరుణతో నాక్కూడా అంతులేని శక్తిని అనుగ్రహించు. నీవు అనంతమైన బలానివి. నాకూ బలాన్నివ్వు. నీవు అనంతమైన అధికారానివి. నాక్కూడా గొప్ప అధికారం ఇవ్వు. దుర్మార్గుల పాలిట నీవు మహోగ్రుడవు. (మంచి కోసం) నన్నూ ఉగ్రునిగా మలచు. దుర్భాషలు, స్తుతి స్తోత్రాలు నిన్ను ప్రభావితం చేయజాలవు. నీ ప్రత్యర్థుల పాలిట నీవు భారంగా పరిణమిస్తావు. నన్ను కూడా భారంగా పరిణమింపజేయి."

(యజుర్వేదం 20 : 9)

"ఓ కృపాసాగరా! నా మనసు జాగృదావస్థలో చాలా దూరాలు ప్రయాణిస్తుంది. దివ్యగుణాలను కలిగివుంటుంది. ఆ నా మనసే నిద్రావస్థలో సుషుప్తిని పొందుతుంది. స్వప్న లోకాల్లో ఎక్కడెక్కడో విహరిస్తుంది. అలాంటి నా మనసుకు మీ దయతో – తన కొరకూ, ఇతరులకూ మేలు జరిగే విధంగా – కేవలం మంచి ఆలోచనలనే కలుగజేయండి. అది ఇతరులకు హాని చేయాలని ఎన్నడూ కోరుకోకూడదు." (యజుర్వేదం 34 : 1)

"ప్రభూ! ఏది ఉత్కృష్ట జ్ఞానమో, ఏది ఇతరులకు చైతన్యమును ఇచ్చే నిశ్చయాత్మక వృత్తియో, ఏది ప్రజల్లో ప్రకాశవంతమవుతుందో, నాశనం లేకుండా ఉంటుందో అటువంటి నా మనసు శుద్ధగుణములను కోరి దుష్ట గుణముల నుంచి దూరంగా ఉండే విధంగా కనికరించు స్వామీ!"

(యజుర్వేదం 34 : 3)

యజుర్వేదంలోని ఓ ప్రార్థనా వాక్యం ఇలా ఉంటుంది:

"సుఖములు ఇచ్చేవాడవు, స్వప్రకాశవంతుడవు, సర్వజ్ఞుడవు అయిన ఓ ప్రభూ! నీవు మమ్మల్ని శ్రేష్ఠ మార్గములో నడపించి మాకు సంపూర్ణ జ్ఞానమును





ప్రసాదించు. కుటిల పాపాచరణ రూపమైన మార్గం నుంచి మమ్మల్ని దూరం చేయి." (యజుర్వేదం 40 : 16)

ఖుర్ఆన్‌లోనూ సరిగ్గా ఇలాంటి ప్రార్థనే ఒకటుంది:

"మాకు రుజుమార్గం (సన్మార్గం) చూపించు. నీవు అనుగ్రహించిన వారి మార్గం, నీ ఆగ్రహానికి గురికానివారి, అపమార్గానికి లోనుకాని వారి మార్గం (చూపు)." (ఖుర్ఆన్ 1 : 6,7 వాక్యాలు)

సామవేద బోధనలూ ఈ సత్యాన్నే ప్రతిబింబిస్తున్నాయి:

## 3. సామవేదం

"శరీరంలోని ప్రధాన శక్తులు మొత్తం శరీర వ్యవస్థను నియంత్రించినట్లు, దానిని పాలించినట్లు యావత్ విశ్వ వ్యవస్థను నియంత్రించే, దానిని పాలించే ఓ ప్రాణా! మేము నీ సన్నిధిలో వంగుతున్నాము."

(సామవేదం 7:3:8:16:2:3:2)

అధర్వణవేదంలో కూడా ఇలాగే ఉంది.

## 4. అధర్వణ వేదం

అధర్వణవేదం దేవుణ్ణి ఈ విధంగా స్తుతిస్తోంది:

"దేవ్ మహా ఓసి"

**"దేవుడు నిశ్చయంగా మహోన్నతుడు."** (అధర్వణవేదం 20 : 58:3)

"ఆయన ఇంద్రుడు (సర్వశక్తిమంతుడు, సర్వాధికృుడు)."

(అధర్వణ వేదం 11:2:1)

"దేవుడు కాలానికి అతీతుడు. వినాశనం లేనివాడు. సూర్యుడు, భూమి ఇంకా ఇతర గ్రహాలన్నిటి పరిపోషకుడు." (అధర్వణ వేదం 14 : 1 : 1)

"ఎండ (సూర్యుని) ద్వారా మనిషి ప్రకాశవంతుడైనట్లు (భూమి లాంటి) ఇతర గ్రహాలు కూడా సూర్యుని మూలంగా ప్రకాశవంతమవుతాయి."

(అధర్వణ వేదం 14: 1)

## 4. భ్రమల చీకట్లను పారద్రోలును ఈ సుప్రభాతము!

"కౌసల్యాసుప్రజారామా!"

**కౌసల్యకు పుట్టిన ఓ మంచి పిల్లవాడా! రామా!**

"పూర్వాసంధ్యాప్రవర్తతే"

**సూర్యోదయానికి వేళ అవుతుంది.**

"ఉత్తిష్ఠ! నరశార్దూలా!"

**"నరులలో పులివంటివాడా! లే!**

"కర్తవ్యం దైవమాన్హికం"

**ఆ దైవాన్ని ఆరాధించటం నీ కర్తవ్యం.**

ప్రియ మిత్రులారా!

పైన పేర్కొనబడిన సుప్రభాత వాక్యాలు మనలో ప్రతి ఒక్కరికి తెలుసు. కాని మనలో చాలా మందికి ఆ వాక్యాల అర్థం ఏమిటో తెలియదు. ఒకవేళ మనం పైన పేర్కొనబడిన సుప్రభాత వాక్యాలను ఒకసారి గనక క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకుంటే, రాములవారు కూడా మనలాంటి మానవ మాత్రులేననీ, కౌసల్య తల్లికి పుట్టిన బిడ్డ అనీ, ఆయన స్వయంగా ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు సర్వశక్తిమంతుడైన దేవుణ్ణి ఆరాధించేవారన్న సంగతి చాలా స్పష్టంగా మనకు బోధపడుతుంది.

మనం నిజంగా శ్రీరాములవారిని ప్రేమించేవారమైతే, ఆయన్ను అనుసరించాలని అభిలషిస్తున్నట్లయితే ముందుగా మనం ఆయన తన జీవితాంతం ఏ దేవుణ్ణయితే ఆరాధిస్తూ ఉన్నారో ఆ ఏకైక దేవుణ్ణి ఆరాధించాలి.

క్రింద పేర్కొనబడుతున్న ఉపనిషత్ శ్లోకం దేవునికి తల్లిదండ్రులు లేరని స్పష్టం చేస్తోంది. కనుక శ్రీరాములవారు దేవుడు కారు. ఇంకా చెప్పాలంటే ఆయన కూడా ప్రతి రోజూ దైవిక విధులను ఆచరించి మనందరిని సృష్టించిన ఆ పరమ ప్రభువును ఆరాధిస్తూ ఉండేవారని తెలుస్తోంది.

"న చాస్యకశ్చిజ్జనితా న చాధిపః"

**"ఆయనకు తల్లిదండ్రులు లేరు. ఆయనకు ప్రభువు లేదు."**

*(శ్వేతాశ్వతర ఉపనిషత్ 6 : 9)*





## 5. సాయి బాబా ప్రవచనాలు

సాయి బాబా తన జీవితాంతం ఈ క్రింది ప్రవచనాలను తరచూ పలుకుతూ ఉండేవారు:

"సబ్ కా మాలిక్ ఏక్ హై" **- అందరి దేవుడు ఒక్కడే.**

"అల్లాహ్ మాలిక్" **- అల్లాహ్‌యే దేవుడు.**

"అల్లాహ్ భలా కరేగా" **- అల్లాహ్ మేలు చేస్తాడు.**

మిత్రమా!

సాయి బాబా ఒక ఫకీరు. ఓ నిజమైన ముస్లిం (విశ్వాసి). ఆయన ప్రతి రోజూ చేయవలసిన విధి నమాజులను క్రమం తప్పక ఆచరిస్తుండేవారు. ఖుర్ఆన్ చదివేవారు. ఉపవాసం పాటించేవారు. అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేసేవారు.

**"ప్రతి రోజూ ఉదయం సాయి బాబా చాలా పెందలాడే నిద్ర లేస్తారు. అన్నింటి కంటే ముందు నమాజులు ఆచరిస్తారు."**

*(ఆచార్య ఇ.భరద్వాజ రాసిన "సాయి బాబా ది మాస్టర్" పుస్తకం, 139 వ పేజి)*

**తానూ ఓ దైవదాసుడినేనని సాయి బాబా స్వయంగా చెప్పి ఉన్నారు.**

**"నేను దేవుని దాసుణ్ణి. దేవుడు ప్రభువు మరియు యజమాని."**

*(ఆచార్య ఇ.భరద్వాజ రాసిన "సాయి బాబా ది మాస్టర్" పుస్తకం, 228 వ పేజి)*

**దేవుని పేరు ప్రస్తుతించమని, ధర్మగ్రంథాలను అధ్యయనం చేయమనే సాయి బాబా ప్రజలకు ఎల్లప్పుడూ బోధిస్తూ ఉండేవారు.**

**"పని చేయండి, దైవనామాన్ని స్మరించండి. ధర్మగ్రంథాలు చదవండి. పరస్పరం విద్వేషాలు, జగడాలు మానుకుంటే దేవుడు మిమ్మల్ని కాపాడతాడు."**

*(ఆచార్య ఇ.భరద్వాజ రాసిన "సాయి బాబా ది మాస్టర్" పుస్తకం, 232 వ పేజి)*

**అల్లాహ్ తప్ప మరొక దేవుడు లేడని సాయి బాబా చాలా స్పష్టంగా చెప్పారు.**

**"నిరుపేదలను కాపాడేవాడు అల్లాహ్ మాత్రమే. ఆయన తప్ప మరో దేవుడు లేనే లేడు."**

*(ఆచార్య ఇ.భరద్వాజ రాసిన "సాయి బాబా ది మాస్టర్" పుస్తకం, 235 వ పేజి)*

**తాను అల్లాహ్ దాసుణ్ణని సాయి బాబా చెప్పుకునేవారు.**

**"నేను ఎవరికీ నౌకర్ను కాను. నేను కేవలం అల్లాహ్ దాసుణ్ణి."**

**"అల్లాహ్ నామమే శాశ్వతమైనది."**

*(ఆచార్య ఇ.భరద్వాజ రాసిన "సాయి బాబా ది మాస్టర్" పుస్తకం, 236 వ పేజి)*

సాయి బాబా గురించి ఈ నిజాలు తెలుసుకున్న తర్వాత కూడా మనం అల్లాహ్‌ను వదలిపెట్టి సాయి బాబాను ఎలా పూజించగలం? మనం నిజంగా సాయి బాబాను ప్రేమిస్తున్నట్లయితే ముందు ఆయన బోధనలను ఆచరణలో పెట్టాలి. ఆయన జీవితం గడిపిన విధంగా మనమూ జీవితం గడపాలి. సాయి బాబాయే సాక్షాత్తు దేవుడైతే ఆయన, **"సబ్ కా మాలిక్ మై హూం (అందరికి దేవుణ్ణి నేనే)"** అని చెప్పి ఉండాల్సింది. కాని ఆయన తన జీవితంలో ఎన్నడూ ఆ మాట చెప్పలేదు.





## 6. క్రైస్తవ మతంలో నిజదైవ భావన

పాఠకులకు మనవి. పై శీర్షికను చూసి ప్రస్తుత కాలంలో, మన చుట్టూ ఉన్న సమాజంలోని క్రైస్తవులు విశ్వసిస్తున్న దైవ భావనను ఇక్కడ వివరించదలచామని భావించకండి. మా ఉద్దేశం అది కానే కాదు. ఎందుకంటే, నిజదైవ భావనకు – క్రైస్తవులు కనబరుస్తున్న ఆచరణాత్మక విశ్వాసాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఇక్కడ పేర్కొనబడుతున్న బైబిలు వాక్యాలను గనక మీరు క్షుణ్ణంగా పరిశీలిస్తే, ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు అనుసరిస్తున్న 'ఏకదైవారాధన', నేతి బీరకాయ చందమేనన్న నిజం తేటతెల్లం అవుతుంది. యేసు ప్రవక్త (ఆయనపై దేవుని శాంతి కలుగుగాక!) తన యుగంలో స్వచ్ఛమైన ఏకదైవారాధన బోధించినప్పటికీ కాల గమనంలో చాప క్రింద నీరులా క్రైస్తవంలోకి బహుదైవత్వ భావనలు, ఆచారాలు ప్రవేశించాయనే సత్యానికి క్రింది బైబిల్ వాక్యాలు సజీవ సాక్ష్యాలుగా నిలబడతాయి. స్వచ్ఛమైన ఏకదైవారాధనకు సంబంధించి, నిజమైన దైవభావనకు సంబంధించి బైబిల్‌లోని అవశేష సూక్తులను ఏర్చికూర్చి పాఠకులకు అందించటం, దీనిపై నిర్ణయాన్ని వారి విజ్ఞతకు వదిలేయటం ఈ శీర్షిక ప్రధాన ఉద్దేశం.

### బైబిలు ప్రకారం ఆది అంతం లేనివాడే దేవుడు:

**"నాకు ముందుగా ఏ దేవుడునూ నిర్మింపబడలేదు. నా తర్వాత ఏ దేవుడునూ నుండడు. నేను నేనే యెహోవాను. నేను తప్ప వేరొక రక్షకుడు లేడు."**

*(బైబిలు యెషయా 43:10)*

### బైబిలు ప్రకారం పుట్టుట – గిట్టుట లేనివాడే దేవుడు:

**"యెహోవాయే నిజమైన దేవుడు. జీవము గల (చావులేని) దేవుడు ఆయనే."**

*(బైబిలు – యిర్మియా 10:10)*

**"జీవము గల (చావులేని) తండ్రి (దేవుడు) నన్ను పంపెను."**

*(బైబిలు – యోహాను 6:57)*

**బైబిలు ప్రకారం దేవుడు మానవునిగా అవతరించలేదు:**

"నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు (ప్రపంచంలో) నివాసము చేయడు."

*(బైబిలు 1 రాజులు 8:27)*

**మరింత స్పష్టం ఈ ప్రోక్తం:**

"దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు. నరపుత్రుడు కానే కాడు." *(సంఖ్యా కాండం 23:19)*

**ప్రవక్త యేసు (ఆయనపై దేవుని శాంతి కలుగుగాక!) స్వయంగా ఈ మాట అన్నారు:**

**"మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు (యహోవ). నీవు నీ పూర్ణ హృదయంతో నీ పూర్ణాత్మతో, నీ పూర్ణ వివేకంతో, నీ పూర్ణ బలముతో నీ దేవుడైన ప్రభువు (యహోవ)ను ఆరాధింపవలెను."**

*(బైబిలు - మార్కు 12:30-32)*

యేసు ప్రవక్తను ప్రేమించాలి, ఆయన్ను గౌరవించాలి, ఆయన్ని ఒక నిజ ప్రవక్తగా గుర్తించాలి. ఆయన్ని తనివితీరా అభిమానించాలి. అంతేగాని ఆయన్ని పూజించటం మాత్రం చేయకూడదు. ఎందుకంటే పూజ అనేది నిజప్రభువుకు ప్రత్యేకమైనది. ఈ వాక్యాన్ని ఓమారు లోతుగా పరిశీలించండి:

"నీవు ప్రార్థన చేయునపుడు నీ గదిలోనికి వెళ్ళి తలుపువేసి రహస్యమందున్న (అగోచరంగా ఉన్న) నీ తండ్రి (యహోవ)కు ప్రార్థన చేయుము. అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి (యహోవ) నీకు ప్రతిఫలమిచ్చును."

*(మత్తయి 6:6)*

**ఏం అర్థమయింది........?**

**మనం ఎవరిని ఆరాధించాలి?**

**నిజదేవుడినా? ఆయన పంపిన ప్రవక్తనా?**

**నిర్ణయం మీదే!**





## 7. అంతా ఆ నిజదేవుని అనుగ్రహమే!

దేవుడు మనకు ఈ ప్రపంచంలో ఎన్నో అనుగ్రహాలను, వరాలను ప్రసాదించాడు. మనకు ఆహారం ఇచ్చేవాడు, అనుగ్రహ ప్రదాత, పరిపోషకుడు ఆయన ఒక్కడే. మన దైనందిన చర్యలనే అందుకు ఉదాహరణగా తీసుకుందాం.

ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకోబోయే వరకు మనకు ఎన్నో వస్తువులు అవసరమవుతాయి. ఈ మధ్యలో మనకు ఎన్నో పరిస్థితులు ఎదురవవచ్చు. కాని ఆ పరిస్థితులన్నీ చాలా సులభంగా గడిచిపోతున్నాయి. చూస్తూ చూస్తూనే మన అవసరాలన్నీ తీరిపోతున్నాయి. ఎలాంటి దాపరికం, మొహమాటం లేకుండా చెప్పుకోవాలంటే, సర్వశక్తివంతుడైన దేవుని అనుగ్రహాలతోనే మనం ఆ అవసరాలన్నిటినీ తీర్చుకోగలుగుతున్నాం. మన సొంతంగా మనం ఏ అవసరాన్నీ తీర్చుకోలేము. ఇది ఎవరూ నిరాకరించలేని సత్యం.

మనం జీవితాంతం శ్వాస తీసుకుంటూనే ఉంటాం. ఈ పని చేయటంలో మనకు ఎన్నడూ బాధ అనిపించదు. ఎంతో సక్రమంగా నడిచే ఈ శ్వాస వ్యవస్థకు కృతజ్ఞతలు తెలియజేసుకోవాలని అనిపిస్తుంది కదూ?!

కళ్లు తెరవగానే మనకు ఈ లోకం కనిపిస్తుంది. దగ్గరగా ఉన్నవి, దూరంగా ఉన్నవి, త్రికోణ దృశ్యాలు, వర్ణభరిత చిత్రాలు అన్నీ మన కళ్లకు ఆనుతున్నాయి. అసలు శరీర అవయవాల్లో కళ్లకున్న ప్రాముఖ్యతే వర్ణనాతీతమైనది. అందుకనే అన్నారు మన పెద్దలు, "సర్వేంద్రియానం నయనం ప్రధానం." నిజంగా కళ్ళు, దేవుడు మనుషులకు ప్రసాదించిన గొప్ప వరం కదండీ?!

ఇంకా మనం ఎన్నో పదార్థాలను రుచి చూస్తాం. ఎన్నో రకాల రుచుల మధ్య తేడాలు గమనిస్తాం. మనం తినే ఆహారంలో విటమిన్లు, మినరల్స్, కార్బోహైడ్రేట్‌లు, ప్రోటీన్లు ఉంటాయి. మానవ దేహంలో వీటివల్ల ఎన్నో రసాయన ప్రక్రియలు జరుగుతాయి. విశ్వప్రభువు ద్వారా నడపబడుతున్న ఈ వ్యవస్థ అత్యద్భుతమైనది.

అంతేకాదు, మన దేహంలో మనకు తెలియకుండానే మరెన్నో సంక్లిష్టమైన ప్రక్రియలు జరుగుతాయని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యపోకుండా ఉండలేము.

ఏదైనా వస్తువును చేతుల్లోకి తీసుకోగానే అది నున్నగా ఉందా లేక గరకుగా

ఉందా అనే విషయం మనకు వెంటనే తెలిసిపోతుంది. ఒక వస్తువు చల్లగా ఉందా లేక వేడిగా ఉందా అనేది కనిపెట్టటానికి మనకు నిమిషంలో వెయ్యో వంతు సమయం కూడా పట్టదు. ఎటువంటి బాహ్య యంత్రాల అవసరం లేకుండానే ఈ పనులన్నీ విద్యుత్ వేగంతో జరిగిపోతాయి. ఇంకా ఇలాంటి లెక్కలేనన్ని సుదీర్ఘ ప్రక్రియలు మన దేహంలో వాటంతట అవే జరుగుతూ పోతుంటాయి. అసలు వీటి గురించి ఆలోచిస్తేనే మనసుకు షాకు తగిలినట్లు ఉంటుంది.

ఇలాంటి వేల రకాల సంక్లిష్ట ప్రక్రియలకు స్థానం మనిషి దేహం. వీటన్నింటికీ మానవ శరీర అవయవాలే బాధ్యత వహిస్తుంటాయి. ఈ కోణం నుంచి చూస్తే మనిషి దేహం ఓ భారీ ఫ్యాక్టరీ లాగా, ఓ మహా కర్మాగారం లాగా అగుపిస్తుంది. పైగా అందులోని అత్యంత సంక్లిష్టమైన పనులు సయితం చాలా సహజమైన రీతిలో సాగిపోతుండటం మానవ మేధకందని మరో విచిత్రం! ఈ భూమ్మీద దేవుడు మనిషికి ఇచ్చిన అతి గొప్ప అనుగ్రహాల్లో ఒకటి మానవ శరీరమే అన్న విషయాన్ని మనసు ఒప్పుకోకుండా ఉండలేదు.

**ఇక్కడే మరో ప్రశ్న కూడా సమాధానం కోసం ఎదురు చూస్తోంది.**

?..?...?..?...?...?...?..?...?...?...?

ఈ మహా కర్మాగారాన్ని నడపటానికి అవసరమైన ముడి సరుకులు ఎక్కడి నుంచి లభిస్తున్నాయి?

ఇంకాస్త అర్థమయ్యేటట్టు ప్రశ్న అడుగుతాను.

జీవితానికి అవసరమయ్యే గాలి, నీరు, ఇతర పోషక పదార్థాలు అసలు ఉనికిలోనికి ఎలా వస్తున్నాయి?

వివిధ పండ్లు, కూరగాయల గురించి ఆలోచిద్దాం. మామిడి పండ్లు, అరటి పండ్లు, బత్తాయి, నారింజ పండ్లు, టమాటాలు, సొరకాయలు, దోసకాయలు అన్నీ నేల నుంచి పండే పంటలే. కాని దేని ప్రత్యేకత దానిది. వాటి రంగులు వేరు. రుచులు వేరు. వాసనలు కూడా వేర్వేరుగా ఉంటాయి. మరి చూడబోతే అవన్నీ ఒకే రకమైన నేల నుంచి మొలకెత్తుతాయి. ఏమిటీ దైవ మహిమ?!

దేవుడిచ్చిన కాయగూరల, పండ్లు ఫలాల రుచులను తానూ సృష్టించగలనని సవాలు విసిరాడు మనిషి ఒకానొక సందర్భంలో! ఆ దిశలో ఎన్నో ప్రయోగాలు





కూడా చేశాడు. ఎంతో సమయం వెచ్చించాడు. ప్రపంచంలోని మహా మహా మేధావుల పరిశోధనా శక్తినంతటినీ ధారబోశాడు. అయినా అనుకున్నది సాధించలేకపోయాడు. ప్రకృతి చేతిలో చిత్తుగా ఓడిపోయాడు. మానవుడు ఎంత ప్రయత్నించినా దేవుడి ప్రకృతిలోని సహజత్వాన్ని అందుకోలేడన్న నిజం మరో మారు లోకం ముందు సుస్పష్టం అయింది.

పండ్లు, కూరగాయలు వేర్వేరు రంగులు, రుచులు, వాసనలు కలిగి వుంటున్నాయి. అది వాటి విత్తనాలకు, వృక్షాలకే ప్రత్యేకమైన అంతర్గత నిర్మాణ ఫలితమని మనం చెప్పకనే చెప్పవచ్చు. మరి చూడండి. ఇంతటి అమూల్యమైన వరాలు మనం అడగకనే దేవుడు మనకు విరివిగా, ఉదారంగా ప్రసాదిస్తున్నాడు. అందుకు మనం ఆయనకు ఎంత కృతజ్ఞతలు చెల్లించుకున్నా తక్కువే.

జంతువులు కూడా ప్రత్యేకంగా మానవుల కోసమే సృష్టించబడ్డాయి. ఈ జంతువులు మనుషులకు ఆహారంగా ఉపయోగపడటమే కాకుండా వాటి బాహ్య రూపం కూడా ఎంతో మంత్రముగ్ధంగా ఉంటుంది. ప్రకృతిసిద్ధ హొయలు ఒలికిస్తూ వివిధ రంగుల్లో, ఆకారాల్లో ఉండే జంతువులు, పక్షులు మనుషులకు కనువిందు చేస్తాయి. నయనానందాన్ని పంచుతాయి. వివిధ వర్ణాల జలచరాలు, రంగురంగుల చేపలు, రొయ్యలు, నక్షత్ర చేపలు సువిశాల సముద్రపు అందాలకు మరిన్ని మెరుగులు దిద్దుతాయి. పెంపుడు పిల్లుల, కుక్కల, పెంగ్విన్‌ల అందాల ఆరబోత పర్యాటకులను ఎంతగానో అలరిస్తుంది. ఇవన్నీ మానవాళి కొరకు దేవుని అనుగ్రహాలే. దేవుడు దివ్య ఖుర్‌ఆన్‌లోని అనేక వాక్యాల్లో ఈ సత్యాన్ని కళ్ళకు కట్టినట్లుగా అభివర్ణించాడు:

> **"ఇంకా భూమ్యాకాశాలలో ఉన్న వస్తువులన్నింటినీ ఆయన–తన తరపున–మీ సేవలో ఉండేటట్లుగా చేశాడు. నిశ్చయంగా యోచన చేసేవారికి ఇందులో ఎన్నో సూచనలున్నాయి."** (ఖుర్‌ఆన్ 45 : 13)

> **"ఒకవేళ మీరు అల్లాహ్ అనుగ్రహాలను లెక్కించదలిస్తే లెక్కించలేరు. నిశ్చయంగా అల్లాహ్ అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించేవాడు."** (ఖుర్‌ఆన్ 16 : 18)

> **"మరి ఆయనే మీరు అడిగిన దానినల్లా మీకు ఇచ్చి ఉన్నాడు. మీరు అల్లాహ్**

చేసిన మేళ్లను లెక్కించదలిచినా లెక్కించలేరు. నిశ్చయంగా మానవుడు మహా అన్యాయపరుడు, మేలును మరిచేవాడు." (ఖుర్‌ఆన్ 14 : 34)

పైన పేర్కొనబడిన జీవాలు దేవుడు మనకు అనుగ్రహించిన అనుగ్రహాల్లో అతి చిన్న భాగం మాత్రమే. ఈ మార్గంలో ఆలోచించుకుంటూ పోతే దేవు నికి సంబంధించిన మరెన్నో గుణవిశేషాలు మన దృష్టికి వస్తాయి. లెక్కలేనన్ని దేవుని మహిమలు మన కళ్ల ముందు సాక్షాత్కారం అవుతాయి. దేవుడు **"అ(ర్రజ్జాక్"**, అంటే అత్యంత గొప్ప ప్రదాత. ఆయన **"అల్ లతీఫ్"**, అంటే అత్యంత సూక్ష్మమైన వాటిని సైతం సృష్టించేవాడు, గ్రహించేవాడు. ఆయన **"అల్ కరీం"**, అంటే మహా ఔదార్యవంతుడు, ఇంకా **"అల్ బర్ర్"**, అంటే మంచికి మూలం అన్నమాట.

**ఇప్పుడు మీ చుట్టూ ఉన్న పరిసరాలనే ఓమారు నిశితంగా పరిశీలించండి. మీ కంటికి కనిపించే ప్రతి వస్తువు గురించి యోచన చేయండి. మీ దగ్గరున్న ప్రతిదీ మీ సృష్టికర్త మీకు అనుగ్రహించిన వరం అన్న సంగతిని మర్చిపోకండి.**

సర్వ శక్తిమంతుడైన దేవుడు ఈ సత్యాన్ని క్రింది దివ్యఖుర్‌ఆన్ వాక్యాల్లో ఈ విధంగా పొందుపరిచాడు:

ఎవరి చేతిలో విశ్వసామ్రాజ్యాధికారం ఉన్నదో ఆయన ఎంతో శుభకరుడు. ఆయన ప్రతి వస్తువుపై అధికారం కలవాడు.

మీలో మంచిపనులు చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావుబతుకులను సృజించాడు. ఆయన శక్తిశాలి, క్షమాశీలి కూడాను.

ఆయన ఒకదానిపై ఒకటిగా సప్తాకాశాలను నిర్మించాడు. (ఓ చూచేవాడా!) నీవు కరుణామయుని సృష్టి ప్రక్రియలో ఎలాంటి అస్తవ్యస్తతను కానలేవు. కావాలంటే మరోసారి (దృష్టిని సారించి) చూడు. నీకేమైనా లోపం (బీటలు వారినట్టు) కనిపిస్తోందా?

మళ్లీ మళ్లీ దృష్టిని సారించు. నీ దృష్టి అలసిసొలసి, విఫలమై నీ వైపు తిరిగి వస్తుంది. (ఖుర్‌ఆన్ 67 : 1-4)





"ఏమిటీ, వీరు తమపై రెక్కల్ని చాచుతూ, (ఒక్కోసారి) ముడుచుకుంటూ ఎగిరే పక్షుల్ని చూడటం లేదా? కరుణామయుడు తప్ప వాటిని ఆ స్థితిలో ఎవరూ నిలిపి ఉంచటంలేదు. నిశ్చయంగా ప్రతి వస్తువూ ఆయన దృష్టిలో ఉంది." (ఖుర్‌ఆన్ 67 : 19)

సరే, తలక్రిందులై ముఖంతో నడిచి పోయేవాడు సన్మార్గం పొందుతాడా? లేక తిన్నని బాటపై (తన కాళ్లమీద) నడిచి పోయేవాడు సన్మార్గం పొందుతాడా? (ఖుర్‌ఆన్ 67 : 22)

వారికి చెప్పు : "మిమ్మల్ని పుట్టించినవాడు ఆయనే (అల్లాహ్‌యే). మీ చెవులను, కళ్లను, హృదయాలను చేసినవాడూ ఆయనే. మీరు కృతజ్ఞతలు తెలిపేది మాత్రం చాలా తక్కువ." (ఖుర్‌ఆన్ 67 : 23)

(ఓ ప్రవక్తా! వారికి) చెప్పు : "ఆయనే కరుణామయుడు. మేము ఆయన్ని విశ్వసించాము. ఆయన పైనే భారం మోపాము. ఇకపోతే, స్పష్టమైన మార్గ భ్రష్టత్వానికి గురై ఉన్నదెవరో మీకు త్వరలోనే తెలిసిపోతుంది." (ఖుర్‌ఆన్ 67 : 29)

వారిని ఇలా అడుగు: "సరే, మీరు త్రాగే ఈ నీరు గనక భూమిలో ఇంకిపోతే, మీ కొరకు నీటి ఊటను బయటికి తెచ్చేదెవరో చెప్పండి!?" (ఖుర్‌ఆన్ 67 : 30)

మీ దగ్గరున్న భాగ్యాలన్నీ అల్లాహ్ ప్రసాదించినవే. ఇప్పటికీ మీకేదైనా కష్టం వస్తే మీరు ఆయనకే మొరపెట్టుకుంటారు. (ఖుర్‌ఆన్ 16 : 53)

## 8. ప్రజలందరికి ఇదే నా ఆహ్వానం

ప్రియ స్నేహితులారా!

దివ్యఖుర్ఆన్‌లోని అపురూపమైన ఓ వాక్యం ద్వారా నేను మిమ్మల్ని మరోసారి సత్యబద్ధమైన జీవన మార్గం వైపునకు ఆహ్వానిస్తున్నాను.

విశ్వసించిన ఆ వ్యక్తే ఇంకా ఇలా అన్నాడు : "ఓ నా జాతి (ప్రజలారా)! మీరు (అందరూ) నన్ను అనుసరించండి. నేను మిమ్మల్ని మంచి మార్గం వైపుకు దర్శకత్వం వహిస్తాను. "ఓ నా జాతి (వారలారా!) ఈ ప్రాపంచిక జీవిత సౌఖ్యాలు తాత్కాలికమైనవి. పరలోకమే శాశ్వతంగా ఉండే నిలయం. "ఎవడయినా పాపానికి పాల్పడితే దానికి సరిసమానమైన (పాప) ఫలమే అతనికి లభిస్తుంది. మరెవడయినా పుణ్యకార్యం చేస్తే – అతడు పురుషుడైనా, స్త్రీ అయినా – అతడు గనక విశ్వాసి అయివుంటే – అలాంటి వారంతా స్వర్గంలో ప్రవేశిస్తారు. వారక్కడ లెక్కలేనంత ఉపాధిని పొందుతారు. "ఓ నా జాతి (జనులారా)! నేను మిమ్మల్ని మోక్షం వైపునకు పిలుస్తుంటే, మీరు నన్ను నరకాగ్ని వైపునకు పిలుస్తారేమిటి? "నేను అల్లాహ్‌ను తిరస్కరించాలనీ, నేనెరుగని వాటిని ఆయనకు సహవర్తులుగా నిలబెట్టాలని మీరు నన్ను ఆహ్వానిస్తుంటే, నేను మాత్రం మిమ్మల్ని అసాధారణ శక్తిశాలి, క్షమాశీలి వైపునకు ఆహ్వానిస్తున్నాను.

"మీరు నన్ను ఎవరి వైపునకు పిలుస్తున్నారో వారు ఇహలోకంలోగానీ, పరలోకంలోగానీ పిలువటానికి అసలు యోగ్యులుకారన్న విషయంలో సందేహానికి ఆస్కారమేలేదు. మరి మనమంతా మరలిపోవలసింది అల్లాహ్ వద్దకే (అన్నది కూడా నిర్వివాదాంశమే). మరి బరితెగించి పోయేవారే నరకవాసులవుతారు (అనేది కూడా ముమ్మాటికీ నిజం). "ముందు మీరు నేను చెప్పిన మాటల్ని జ్ఞాపకం చేసుకుంటారు. నేను మటుకు నా వ్యవహారాన్ని అల్లాహ్‌కు అప్పగిస్తున్నాను. నిశ్చయంగా అల్లాహ్ తన దాసులందరినీ చూస్తూనే ఉన్నాడు." *(ఖుర్ఆన్ 40 : 38-43)*





**హిందూ ధర్మగ్రంథాలు కూడా ఏకదైవ భావననే ఘోషిస్తున్నాయన్న వాస్తవాన్ని మనం మర్చిపోరాదు సుమా!**

- "దేవుడు ఒకే ఒక్కడు. ఆయన్నే ఆరాధించండి." *(ఋగ్వేదం 6: 45: 16)*
- "ఆయన్ను తప్ప మరొకరిని ఆరాధించకండి." *(ఋగ్వేదం 8:1:1)*
- "దేవుడు ఒకే ఒక్కడు. మరొకడు లేనే లేడు." *(చందోగ్య ఉపనిషత్ 6:2:1)*
- "న తస్య ప్రతిమ అస్తి"

  ఆయనకు పోలిక ఎవరూ లేరు. *(యజుర్వేదం 32:3)*

అత్యధిక హిందువులు చెప్పినట్లు హైందవం అనేది ఒక మతం కాదు. అదొక ధర్మం. అదొక సంస్కృతి. ఆ సంస్కృతిలో వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, బ్రాహ్మణ గ్రంథాలు దివ్య గ్రంథాలుగా పేర్కొనబడతాయి. వాటిలోనూ వేదాలు అత్యంత పవిత్రమైనవిగానూ భావించబడతాయి. అలాగే భగవద్గీత, మహాభారతం, రామాయణం వంటివి మరికొన్ని కూడా హిందూ ధర్మ గ్రంథాలలో ఉన్నాయి.

ఏదైనా మానవ సమాజం దేవుడు తనకు ప్రసాదించిన మార్గదర్శకత్వాన్ని ప్రక్కకు నెట్టేసి, మనోవాంఛలకు దాసోహమైపోయి, స్వీయ కోరికల వెంట పరిగెత్తినప్పుడు ఇక ఆ సమాజానికి క్షీణదశ మొదలవుతుంది. క్రమంగా అది దైవత్వపు భావనలో భ్రష్టతకు దారితీస్తుంది. హిందూ సమాజంలో అనేక దేవుళ్ల పూజ ఇటువంటి భ్రష్టతకు నిలువెత్తు నిదర్శనం. నేడు హిందువులు అనుసరిస్తున్న విధానం స్వయానా వారి మత గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తుల ప్రబోధనలకు పూర్తిగా విరుద్ధం. వారి మత గ్రంథాలు కూడా వాస్తవానికి దేవుని ఏకత్వ భావననే బోధించాయనటానికి వాటిలోని వాక్యాలే సజీవ సాక్ష్యాలు. ఇంకో విజ్ఞప్తి! నాడు హిందూ మతగ్రంథాలు ప్రబోధించిన వాస్తవ దైవ భావన మరేదో కాదండోయ్. అది అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) మానవాళికి అందజేసిన సందేశమే!

**కనుక ఇకనైనా ఏకదైవారాధన వైపుకు, నిజదేవుని ఆరాధన వైపుకు మరలి రమ్మని తోటి సోదరులందరినీ నేను ఆహ్వానిస్తున్నాను.** దేవుడు తన అంతిమ ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా మనకు మళ్ళీ గుర్తుచేసిన ఆ పాఠం వైపుకే నేను మిమ్మల్ని పిలుస్తున్నాను.

సర్వశక్తిమంతుడైన దేవునికి తోడు ఇంకొద్ది మంది దేవుళ్లు ఉన్నారు అని మనలో చాలా అంటున్నారు. ఇలా అనటం అతి ఘోరమైన తప్పిదం. **"మనందరికీ ప్రభువైన దేవుడు తప్ప మరో ఆరాధ్యుడులేడు."** ఈ వాక్కు నిజదేవునికి అత్యంత ప్రియమైనది. మన నుంచి ఆయన ఆ ప్రియవాక్కునే కోరుతున్నాడు. తన దాసులు ఆ ప్రియవాక్కుకు అనుగుణమైన కర్మలే చేయాలని ఆకాంక్షిస్తున్నాడు. కనుక ప్రతి ఒక్కరు తమ ఆత్మల పట్ల నమ్మకంతో నడచుకోవాలి. తోటి వారిపట్ల నిజాయితీగా, న్యాయంగా వ్యవహరించాలి. రుజుమార్గంపై తామూ నడవాలి, ఇతరులను సైతం నడిపించటానికి కృషి చేయాలి.

**మన ఆరాధనలన్నింటినీ ఏకైక నిజదేవునికి అంకితం చేసుకోవటమే ఇస్లాం ధర్మం.** మానవాళి కొరకు దేవుడు ఎన్నుకున్న మార్గం అదొక్కటే. సర్వమానవ సమానతకు, సౌభ్రాతృత్వానికి, మరణానంతరం పరలోక శాశ్వత జీవితంలో ముక్తికి ఏకైక మార్గం కూడా అదే. మిథ్యాదైవాల పూజ నిజదేవుణ్ణి ప్రసన్నం చేయదు. పైగా అది ఘోర అపచారం అవుతుంది. దేవుని పట్ల అవిధేయతగా పరిగణించబడు తుంది. అజ్ఞానపు చేష్టగా ఖరారు చేయబడుతుంది. మన చుట్టూ ఉన్న హిందూ సోదరుల్లో ఎవరైనా ఈ ఇస్లాం పిలుపును అంగీకరించినట్లయితే, నిజానికి వారు తమ అసలు ధర్మం వైపుకే మరలుతున్నారు. దేవుడు మానవాళి కొరకు నిర్ణయించిన జీవన విధానాన్నే వారు ఎంచుకున్నారు. ఇది ఎల్లరూ తెలుసుకోవలసిన విషయం.

ఏమైనప్పటికీ వేదాల అధ్యయనం దేవుని ఏకత్వ భావనను తెరపైకి తీసుకు వస్తుంది. నేటి హిందువులు ఎంతోమంది దేవుళ్లను పూజిస్తున్నారు. విగ్రహాలను ఆరాధిస్తున్నారు. నిజానికి ఇది పచ్చి మార్గ భ్రష్టత్వం. వేద ప్రబోధనాలకు పూర్తిగా విరుద్ధం. అయితే ఇక్కడ మరొక విషయాన్ని కూడా గ్రహించటం మనకు కష్టం కాదు. అదేమిటంటే, హిందువులు దేవుణ్ణి వివిధ రూపాల్లో ఆరాధిస్తున్నారు కదా! ఆ రూపాలు మరేవో కావు. అవి దివ్యఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడ్డ అల్లాహ్ యొక్క గుణాలే. ఈ పుస్తకంలో పొందుపరచబడిన దివ్య ఖుర్‌ఆన్ వాక్యాలను సూక్ష్మంగా పరిశీలిస్తే మనకు ఆ విషయం తప్పకుండా బోధపడుతుంది.





## మరికొన్ని నిజాలను నిగ్గుదేల్చుదాం, రండి!

**గాంధీ మహాత్ముడు తనదైన శైలిలో ఇలా రాశారు:** *"ఎవరో చెబుతుంటే విన్నాను, ఇస్లాం వ్యాప్తి దక్షిణాఫ్రికాలోని యూరోపియన్లను కలవర పెట్టిస్తోందని. అసలు ఇస్లాం ఎలాంటి ఉద్యమం అనుకుంటున్నారు? అది స్పెయిన్‌ను నాగరికత గల దేశంగా మలచింది. అంధకారంలో చిక్కుకొని ఉన్న మొరాకోకు విజ్ఞానపు కరదీపికను అందించింది. ప్రపంచానికి సౌభ్రాతృత్వపు సందేశాన్ని చాటిచెప్పింది. అలాంటి ఇస్లాం పేరు విని దక్షిణాఫ్రికాలోని యూరోపియన్లు కలవరపడుతున్నారంటే, ఇస్లాం చలువతో దక్షిణాఫ్రికన్లు తాము తెల్లదొరలతో సమానమే అని గొంతెత్తుతున్నందుకు కాబోలు. సోదర భావం అనేది పాపమా? వారు ఇస్లాంను చూసి కలవర పడటానికి! ఒకవేళ నిజంగానే అది నల్లవాళ్ళ – తెల్లవాళ్ళ సమానత్వానికి సంబంధించినదయితే ఇక వారి భయం దేనిగురించో చెప్పనక్కర్లేదు."*

- క్రైస్తవం, ఇస్లాం తరువాత **హిందూమతం** ప్రపంచంలో కెల్లా అతి పెద్ద మతం. తన మతావలంబీకుల సంఖ్య రీత్యా ఇది యావత్ ప్రపంచంలో తృతీయ స్థానంలో ఉంది. నేను నివసించే దేశంలోని అత్యధికులు ఆ మతా వలంబీకులే ఉన్నారు కాబట్టి ఈ విషయానికి నేను ఇంతటి ప్రాముఖ్యత ఇస్తున్నాను. అదీగాక హిందూ మతమే భారతీయతగా భావించుకుంటున్న రోజులివి. ఈ మతం ప్రపంచంలోని అతి ప్రాచీన మతం అని, దీని సంస్కృతి ప్రపంచంలోకెల్లా అతి ప్రాచీన సంస్కృతి అని స్వయానా ఈ మత అనుయాయు ల్లోని మెజారిటీ వర్గం అభిప్రాయపడుతోంది. పోతే భారతదేశంలో అతి పెద్ద మైనార్టీవర్గం ముస్లింలదే. వారు దేశ జనాభాలో 12 నుంచి 15% మంది ఉన్నారు.
- కాని **ఇస్లాం** వైఖరి ఇందుకు పూర్తిగా విభిన్నం. అది ఎన్నడూ తన పరిధిని కుంచింపచేసుకోలేదు. తాను ఏదో ఒక ప్రాంతానికి లేక ప్రజలకు చెందిన సొత్తుగా ప్రకటించుకోలేదు. తొలినాటి నుంచే అది ఒక విశ్వవ్యాప్త సందేశాన్ని కలిగివుంది. మొదటి నుంచీ అది యావత్ మానవాళిని సంబోధిస్తూ వస్తోంది. మానవులందరిని ఏక సమాజంగా పరిగణించింది. నేడు ప్రపంచ వ్యాప్తంగా

ముస్లింల జనాభా 1.2 బిలియన్ల కంటే ఎక్కువే. కాని ఇక్కడ విచిత్రం ఏమిటంటే ముస్లింలలో మెజారిటీ వర్గం అరబ్బేతరులదే. ఈ పరిస్థితి చెప్పకనే చెబుతోంది. **ఇస్లాం యావత్ మానవాళికి దేవుని తరఫు నుండి ఒక బహిరంగ ఆహ్వానం. ఇది వ్యక్తిగతమైన ఆధ్యాత్మిక విషయం కాదు. సత్యాన్ని, న్యాయాన్ని పరిస్థాపించే ఉద్దేశంతో ముందుకు దూసుకెళుతున్న ఓ క్రియాశీల ఉద్యమం. అది బోధిస్తున్నది అత్యంత స్వచ్ఛమైన సత్యం. "నిజ దేవుడు తప్ప మీకు ఆరాధ్యుడు లేడు" అన్నది దీని ప్రాథమిక సూత్రం. ఇది ఇహలోకంలోను, మరణానంతరం పరలోక శాశ్వత జీవితంలోనూ మన విజయానికి నాంది వాచకం.**





## 9. కొన్ని ఆసక్తికరమైన ప్రశ్నలు

ప్రియ మిత్రమా!

ఈ సందర్భంగా కొన్ని ప్రశ్నలు – వాటికి సరైన సమాధానాలు నీ ముందు ప్రస్తావించటం సముచితమని భావించి ఈ ప్రశ్నావళిని నేను నీకు అందజేస్తున్నాను. ఈ సమాధానాలన్నీ దివ్య ఖుర్ఆన్ గ్రంథం నుంచి సేకరించబడినవి. తెలుసు కదా!, దివ్య ఖుర్ఆన్ యావత్ మానవాళి కోసం విశ్వప్రభువు తరఫు నుంచి అవతరించబడిన అంతిమ ఆకాశ గ్రంథం. దయచేసి ఈ సమాధానాలను జాగ్రత్తగా చదవండి. వాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేయండి. తర్వాత బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రండి.

### 1. దేవుడు ఎవరు?

**(ఓ ముహమ్మద్-స!) వారికి ఇలా చెప్పు: ఆయన (అల్లాహ్) నిజమైన ఆరాధ్యుడు ఒక్కడు.**

**అల్లాహ్ నిరపేక్షాపరుడు. (ఏ అక్కరా లేనివాడు).**

**ఆయన (ఎవరినీ) కనలేదు. ఆయన (కూడా) ఎవరికీ పుట్టినవాడు కాదు.**

**ఆయనకు సరిసమానుడు (పోల్చదగిన వాడు) ఎవడూ లేడు.**

*(ఖుర్ఆన్ 112 : 1-4)*

**ఆయనే అల్లాహ్. మీ ప్రభువు. ఆయన తప్ప మరొకరెవరూ ఆరాధ్యులు కారు. సమస్త వస్తువులను సృష్టించిన వాడు ఆయనే. కాబట్టి మీరు ఆయన్నే ఆరాధించండి. అన్ని విషయాల కార్య సాధకుడు ఆయనే.**

**ఎవరి చూపులు కూడా ఆయన్ని అందుకోజాలవు. ఆయన మాత్రం అందరి చూపులను అందుకోగలడు. ఆయన సూక్ష్మదృష్టి కలవాడు. సర్వమూ తెలిసినవాడు.** *(ఖుర్ఆన్ 6 : 102,103)*

### 2. దేవుడు (విశ్వ సృష్టికర్త) తప్ప మరో దేవుడు ఉండటానికి ఆస్కారం ఉందా?

**అల్లాహ్ ఎవరినీ కొడుకుగా చేసుకోలేదు. ఆయనతోపాటు ఇంకొక ఆరాధ్య**

దేవుడు కూడా (భాగస్వామిగా) లేడు. ఒకవేళ అలాంటిదేదైనా ఉంటే ప్రతి దేవుడూ తాను సృష్టించిన సృష్టితాలను వేరుగా తీసుకుని వేరయి పోయేవాడు. ఒకడు ఇంకొకనిపై దండయాత్ర చేసేవాడు. వారు అల్లాహ్‌కు ఏ లక్షణాలను ఆపాదిస్తున్నారో వాటికి ఆయన అతీతుడు, పవిత్రుడు.

(ఖుర్ఆన్ 23 : 91)

**3.** ఒకవేళ ఒకరి కంటే ఎక్కువమంది దేవుళ్ళు ఉంటే భూమిని, చంద్రుణ్ణి సృష్టించినదెవరు? సూర్యుణ్ణి, నీటిని, గాలిని, అగ్నిని, ఆకాశాన్ని, నక్షత్రాలను, మానవులను, ఇంకా ఇతర సజీవ, నిర్జీవ పదార్థాలన్నిటినీ సృజించినదెవరు? ఒకవేళ అదే నిజమైతే నీవు పూజిస్తున్న దేవుళ్ళు "మేమే దేవుళ్ళం. మమ్మల్నే పూజించండి' అని ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రకటించారా? ఏయే దేవుళ్ళు, ఏయే పదార్థాలు సృష్టించారో దానికి సంబంధించిన భోగట్టా ఏమైనా ఉందా?

(ఓ ప్రవక్తా!) వారికి చెప్పు : అల్లాహ్‌ను వదలి మీరు మొరపెట్టుకుంటున్న మీ కల్పిత భాగస్వాముల సంగతిని కాస్త తెలియజేస్తారా?! వారు భూమిలో సృష్టించిందేమిటో నాకు చూపండి. లేక ఆకాశాలలో వారికేదైనా భాగస్వామ్యం ఉన్నదా? పోనీ వారికి మేమేదైనా పుస్తకం ఇచ్చామా, దాని ప్రమాణానికి వారు కట్టుబడి ఉన్నారనటానికి!? లేదు. వాస్తవానికి ఈ దుర్మార్గులు ఒండొకరికి మోసపూరితమైన వాగ్దానాలు చేస్తూ వస్తున్నారు.

(ఖుర్ఆన్ 35 : 40)

**4.** కాలాన్ని బట్టి, జాతిని బట్టి, ప్రజలను బట్టి, మతాలను బట్టి, సంస్కృతిని బట్టి సృష్టికర్త (దేవుడు) వేర్వేరుగా ఉంటాడా? కాలం, కులం, విశ్వాసాలు, నమ్మకాలు, వర్ణం, దేశం అన్న తేడా లేకుండా ఈ ధరిత్రిపై నివసిస్తున్న మానవులమైన మనందరికి పుట్టుక, శ్వాస, దృష్టి, స్పర్శ, తిండి, విసర్జనం, మరణం అన్నీ సమానంగా ఉన్నాయి. మరి అప్పుడు కూడా వేర్వేరు ప్రజలకు వేర్వేరు దేవుళ్ళు ఉంటారా?

ఓ మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుడు, ఒకే స్త్రీ ద్వారా సృష్టించాము. మరి మీ (పరస్పర) పరిచయం కోసం మిమ్మల్ని వివిధ వర్గాలుగా, తెగలుగా చేశాము. యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువగా భయభక్తులు గలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువగా ఆదరణీయుడు. నిశ్చయంగా అల్లాహ్ అన్నీ తెలిసినవాడు, అప్రమత్తుడు. (ఖుర్ఆన్ 49: 13)





ప్రజలారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ పుట్టించిన మీ ప్రభువునే ఆరాధించండి-తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు.

(ఖుర్ఆన్ 2: 21)

**5.** విశ్వమంతటా వ్యాపించి ఉన్న జీవరాసులకు ఆహారం ప్రసాదిస్తున్న దేవునికి (సృష్టికర్తకు) అన్నపానీయాల అవసరం లేదా?

నేను వారి నుండి జీవనోపాధిని కోరటం లేదు. వారు నాకు అన్నం పెట్టాలని కూడా నేను కోరటం లేదు. అల్లాహ్‌యే స్వయంగా అందరికీ ఉపాధిని సమకూర్చేవాడు. ఆయన మహా శక్తిశాలి, మహాబలుడు.

(ఖుర్ఆన్ 51: 57,58)

**6.** సర్వ శక్తిమంతుడైన దేవునికి నిద్రాహారాలు అవసరమా? ఆయనకు భార్యా బిడ్డలు కావాలా? మరి విశ్వ సృష్టికర్త నిద్రపోతూ ఉంటే అది కాలం నుంచి నేటి వరకు గ్రహాలు తమ కక్ష్యల్ని ఏమాత్రం తప్పకుండా ఎలా పరిభ్రమించగలుగుతున్నాయి?

అల్లాహ్ (మాత్రమే నిజానికి ఆరాధ్య దైవం). ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేనేలేడు. ఆయన సజీవుడు; అన్నింటికీ మూలాధారం. ఆయనకు కునుకు గానీ, నిద్రగానీ పట్టదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయన అధీనంలో ఉంది. ఆయన అనుమతి లేకుండా ఆయన సమక్షంలో సిఫారసు చేయగల వాడెవడు? వారికి ముందు ఉన్న దానినీ, వెనుక ఉన్నదానిని కూడా ఆయన ఎరుగు. ఆయన కోరినది తప్ప ఆయనకున్న జ్ఞానంలోని ఏ విషయమూ వారి గ్రాహ్య పరిధిలోకిరాదు. ఆయన కుర్చీ వైశాల్యం భూమ్యాకాశాలను పరివేష్ఠించి ఉంది. వాటిని రక్షించటానికి ఆయన ఎన్నడూ అలసిపోడు. ఆయన సర్వోన్నతుడు, గొప్పవాడు. (ఖుర్ఆన్ 2: 255)

**7.** అసలు నీ పుట్టుక పరమార్థం ఏమిటి? నీవు ఏ లక్ష్యంతో పుట్టించబడ్డావు? నీవు ఒక నిర్ణీత కాలం పాటు జీవిస్తున్నావు. ఆ తర్వాత మరణాన్ని ఎదుర్కొంటున్నావు? దీని వెనుక మర్మం ఏమై ఉంటుంది?

నేను జిన్నాతులను, మానవులను సృష్టించినది వారు నన్ను ఆరాధించటానికి మాత్రమే. (ఖుర్ఆన్ 51 : 56)

**ప్రతి ప్రాణీ మృత్యువును చవి చూడవలసిందే. మేము మిమ్మల్ని పరీక్షించే నిమిత్తం కష్టసుఖాలకు (కలిమి లేములకు) గురిచేస్తూ ఉంటాము. ఎట్టకేలకు మీరు మా వద్దకే మరలించబడతారు.** *(ఖుర్ఆన్ 21 : 35)*

మీలో మంచిపనులు చేసేవారెవరో పరీక్షించే నిమిత్తం ఆయన చావుబతుకులను సృజించాడు. ఆయన శక్తిశాలి, క్షమాశీలి కూడాను. *(ఖుర్ఆన్ 67 : 2)*

**8.** మరణానంతర జీవితం ఎలా ఉండబోతోంది? స్వర్గ నరకాలపై నీకు నమ్మకం ఉందా? ఒకవేళ విశ్వంలో అనేక దేవుళ్లు ఉంటే తీర్పుదినాన నీ కర్మల గురించి ఎవరు తీర్పు చెబుతారు? ఏ ప్రాతిపదిక మీద మానవులకు స్వర్గ బహుమానాలు లేక నరక శిక్షలు ఖరారు చేయబడతాయి?

అల్లాహ్ ప్రళయదినాన మిమ్మల్నందరినీ సమీకరిస్తాడు. ఇందులో ఎలాంటి సందేహానికీ తావులేదు. కాని తమను తాము నష్టంలో పడవేసుకున్నవారు మాత్రం విశ్వసించరు. *(ఖుర్ఆన్ 6 : 12)*

నిశ్చయంగా తీర్పుదిన సమయం నిర్ధారితమై ఉంది. శంఖం పూరించబడిన నాడు, మీరు తండోపతండాలుగా తరలివస్తారు. *(ఖుర్ఆన్ 78 : 17.18)*

ఆ రోజు (సంభవించటం అనేది) సత్యం. ఇక కోరినవారు (మంచి పనులు చేసి) తమ ప్రభువు దగ్గర స్థానం ఏర్పరచుకోవచ్చు. *(ఖుర్ఆన్ 78 : 39)*

గ్రంథవహులలో తిరస్కారవైఖరికి పాల్పడినవారు, బహుదైవారాధకులు తప్పకుండా నరకాగ్నికి ఆహుతి అవుతారు. వారందులో కలకాలం ఉంటారు. వారు సృష్టితాలలో అందరి కంటే చెడ్డవారు. *(ఖుర్ఆన్ 98 : 6)*

ప్రశంసలు, పొగడ్తలన్నీ అల్లాహ్‌కు మాత్రమే శోభిస్తాయి. ఆయన సమస్త లోకాలకు పోషకుడు, అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు. ప్రతిఫల దినానికి (అంటే ప్రళయ దినానికి) యజమాని. *(ఖుర్ఆన్ 1 : 2-4)*

అయితే విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు; నిశ్చయంగా సృష్టిలో వారే అందరికన్నా ఉత్తములు. వారికి ప్రతిఫలంగా వారి ప్రభువు దగ్గర శాశ్వతమైన స్వర్గవనాలున్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వాటిలో





వారు కలకాలం ఉంటారు. అల్లాహ్ వారిపట్ల ప్రసన్నుడయ్యాడు. వారు అల్లాహ్‌పట్ల సంతోషపడ్డారు. ఈ అనుగ్రహభాగ్యం తన ప్రభువుకు భయపడే వానికి మాత్రమే. *(ఖుర్ఆన్ 98 : 7,8)*

**9.** నేడు శాస్త్ర, సాంకేతిక రంగాలు మనుపెన్నడూ లేని విధంగా విపరీతంగా అభివృద్ధి చెందాయి? ఇలాంటి యుగంలోనైనా మనిషి స్వంతంగా ఓ చిన్న బియ్యపు గింజనైనా తయారు చేయగలడా? లేదు కదా! మరి ఇప్పుడు ఒక చిన్న ప్రశ్న. బియ్యపు గింజనైనా తయారు చేయలేని నిస్సహాయుడైన మనిషి ఏకంగా విశ్వసృష్టికర్తనే సృష్టించగలడంటే అది నమ్మశక్యమేనా? చెప్పండి.

సరే! మీరు నాటే వస్తువును (విత్తనాన్ని) గురించి ఎప్పుడైనా ఆలోచించారా? ఏమిటి, దాన్ని మీరు పండిస్తున్నారా? లేక దానిని పండించేది మేమా? *(ఖుర్ఆన్ 56 : 63,64)*

నిస్సందేహంగా విత్తనాన్ని, టెంకను చీల్చేవాడు అల్లాహ్‌యే. ఆయన జీవమున్న దానిని జీవములేని దానిలో నుంచి తీస్తాడు. జీవములేని దానిని జీవమున్న దానిలో నుంచి తీసేవాడూ ఆయనే. ఆయనే అల్లాహ్. మరలాంటప్పుడు మీరు (సత్యం నుండి) ఎటు మరలిపోతున్నారు? *(ఖుర్ఆన్ 6 : 95)*

**10.** నిర్జీవ పదార్థాల లక్షణాలను ఒకసారి లెక్కిద్దామా?

- వాటికి జీవం ఉండదు.
- స్పృహ ఉండదు.
- శక్తి ఉండదు.
- జ్ఞానం ఉండదు.
- చలనం ఉండదు.

ఉదా:- రాళ్లు, ఇసుక దిబ్బలు

మరి సజీవ పదార్థాల లక్షణాలను గుర్తు చేసుకుందామా?

- గాలి, నీరు, ఆహారం మొదలగువాటి మీద ఆధారపడి ఉంటాయి.
- నిర్ణీత కాల వ్యవధి వరకే అవి జీవించి ఉంటాయి.
- కొంత కాలానికి నాశనమవుతాయి.

పై లక్షణాలను దృష్టిలో పెట్టుకొని సజీవ పదార్థాలు, నిర్జీవ పదార్థాలు రెండూ సమానమే అని మనం చెప్పగలమా? దాని సమాధానం తప్పకుండా "లేదు" అనే వస్తుంది. మరి అలాంటప్పుడు నిర్జీవ లక్షణాలుగాని లేక సజీవ పదార్థాల లక్షణాలుగాని దేవుని లక్షణాలతో సమానమని ఎలా చెప్పగలమండీ?

ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడు – గోప్యంగా ఉన్నవాటిని, బహిర్గతమై ఉన్నవాటిని ఎరిగినవాడు. ఆయన కరుణామయుడు, కృపాశీలుడు.

ఆయనే అల్లాహ్. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనే రాజాధిరాజు, (పరమ పవిత్రుడు), లోపాలన్నింటికీ అతీతుడు, శాంతి (భద్రతల) ప్రదాత, పర్యవేక్షకుడు, సర్వశక్తుడు, బలపరాక్రమాలు గలవాడు, పెద్దరికం గలవాడు. ప్రజలు ఆయనకు కల్పించే భాగస్వామ్యాల నుండి అల్లాహ్ పవిత్రంగా ఉన్నాడు.

ఆయనే అల్లాహ్ – సృష్టికర్త, ఉనికిని ప్రసాదించేవాడు, రూపకల్పన చేసేవాడు. అత్యుత్తమమైన పేర్లు ఆయనకు ఉన్నాయి. భూమ్యాకాశాలలో వున్న ప్రతి వస్తువూ ఆయన పవిత్రతను కొనియాడుతోంది. ఆయనే సర్వాధికుడు, వివేకవంతుడు. *(ఖుర్ఆన్ 59 : 22, 23, 24)*





## 10. ఆలోచించవలసిన విషయం !

భూమ్యాకాశాల సృష్టికర్త అయిన ఏకైక దేవుడే ఈ లోకంలో మానవులను సృష్టించాడనీ, కనుక మానవులు ఆ ఏకైక దేవుణ్ణే ఆరాధించాలని ఇప్పటి వరకు తెలుసుకున్నాము. ఒకవేళ మానవులు ఆ నిజదైవాన్ని వదలి ఇతరత్ర వస్తువులను, ప్రాపంచిక శక్తులను పూజిస్తే పరలోకంలో అటువంటి వారికి తీవ్ర మైన శిక్షలు ఉంటాయని కూడా మనం మాట్లాడుకున్నాం. ఒక్క దివ్య ఖుర్ఆన్ మాత్రమే కాదు, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత మొదలగు మత గ్రంథాలన్నీ ముక్త కంఠంతో దీని గురించి ఘోషిస్తున్నాయి. అయితే ఇక్కడే ఒక సందేహం మన మనసుల్ని పదే పదే ప్రశ్నిస్తూ ఉంటుంది.

**సర్వసృష్టికర్త అయిన నిజదేవుడు మానవులను పుట్టించి, వారికి ఎటు వంటి మార్గదర్శకత్వం ఇవ్వకుండానే తనను పూజించని వారిని పరలోకంలో శిక్షించటం న్యాయమా?**

కాదు, ముమ్మాటికీ కాదు. ఒకరికి సరైన సమాచారం ఇవ్వకుండా వారి వల్ల పొరబాటు జరిగినప్పుడు దాని మీద వారిని నిలదీయటం, వారి చర్యలను తప్పుబట్టటం, అందుకు వారిని శిక్షించటం న్యాయం కానేకాదు.

మరి మానవులమైన మనకే ఆ పని చాలా అన్యాయంగా తోస్తున్నప్పుడు, పరమ ప్రభువు చూస్తూ చూస్తూ తన ప్రియదాసులపై అంత పెద్ద అన్యాయానికి ఒడిగడతాడా?

### అసంభవం...

వాస్తవం ఏమిటంటే, ఈ ప్రపంచం మొదలైన తొలి నాటి నుంచే దేవుడు మానవుని మార్గదర్శకత్వం కోసం కట్టుదిట్టమైన ఏర్పాటు చేశాడు. మానవులను సన్మార్గంలో నడిపించటం కోసం, మానవులను నిజమైన ఏకదైవారాధకులుగా తీర్చిదిద్దటం కోసం తాను చేయవలసిందంతా చేశాడు. ప్రతి యుగంలోను, ప్రతి సమాజంలోనూ తన తరపున వేలాది, లక్షలాది మంది ప్రవక్తలను, సందేశహరులను పంపించాడు. ఆయా సమాజాల్లో ఉత్తమోత్తమ నైతికత కలిగిన

మనుషులకే అటువంటి ప్రవక్త పదవీ బాధ్యతలను అప్పగించటం జరిగింది. వారి భాషలు వేరై ఉండవచ్చు, వారి యుగాలు, వారి జీవిత కాలాలు వేరై ఉండవచ్చు. కాని వారందరి మూల సందేశం మాత్రం ఒక్కటే.

**"ఓ నా జాతి ప్రజలారా! సృష్టికర్తనే ఆరాధించండి. ఆయన తప్ప మాకు మరొక ఆరాధ్య దేవుడు లేనేలేడు."**

ప్రపంచం మొదలైన తొలినాటి నుంచే సృష్టికర్త మానవులకు పరిపూర్ణమైన మార్గదర్శకత్వాన్ని అందజేశాడని చెప్పటంలోని మరో కోణం ఏమిటంటే, ఆ దేవుడు తన ప్రవక్తలను, సందేశహరులను సామాన్య మానవుల దగ్గరికి ఒట్టి చేతులతో పంపలేదు. మానవ మార్గదర్శకత్వానికి అవసరమైన, మానవాళికి తాను ఇవ్వదలచుకున్న ఆదేశాలన్నిటిని దేవుడు లిఖితపూర్వకంగానే ప్రవక్తలకు అందజేశాడు. మనిషి సన్మార్గంలో నడవటానికి అవసరమయ్యే ఒక్కో విషయం అందులో చాలా స్పష్టంగా ఉండేది. క్లుప్తంగా చెప్పుకోవాలంటే అవన్నీ నిజ దేవుణ్ణి మాత్రమే ఆరాధించమనే ప్రబోధనలు. ఆ లిఖిత పూర్వక పత్రాలు మరేవో కావు, ఈనాడు మన చుట్టూ ప్రచారంలో ఉన్న మత గ్రంథాలే! అలాంటప్పుడు వేలాది సంవత్సరాల చరిత్ర కలిగిన సువిశాల భారత దేశంలో ఒక్క ప్రవక్త కూడా రాలేదని, అసలు ఈ ప్రాంతంలో ఒక్క దైవగ్రంథం కూడా అవతరించలేదని ఎవరైనా చెప్పగలరా? భారత దేశంలోని ప్రాచీన గ్రంథాలు, వేదాలు, ఉపనిషత్తులు పురాణాలు, గీత మొదలగు గ్రంథాలను భారతీయ సమాజం దైవిక గ్రంథాలుగా స్వీకరిస్తుంది. ఆ గ్రంథాల పట్ల ప్రగాఢమైన భక్తీ ప్రపత్తులను చాటుకుంటుంది. అసలు మత గ్రంథాలు ఏవైనప్పటికీ వాటన్నిటి విషయంలో సూత్రప్రాయంగా మనం రెండు విషయాలు గుర్తుపెట్టుకోవాలి.

ఏ మత గ్రంథంలోని ప్రబోధనాలైనా ఆయా ప్రవక్త కాలానికి, ఆయా సమాజ యుగానికి మాత్రమే పరిమితమై ఉంటాయి. ఆ ప్రవక్త తర్వాత మరో ప్రవక్త ఈ లోకంలో అవతరించినప్పుడు గత ప్రవక్త బోధనలను సృష్టికర్త రద్దు చేసేస్తాడు. ఒక ప్రవక్త అనంతరం మరో ప్రవక్త రావటమే అందుకు నిదర్శనం.





అలాగే ఈ లోకంలో అవతరించిన చాలా మంది ప్రవక్తలు తమ తర్వాత రాబోయే ప్రవక్తల గురించి ముందుగానే శుభవార్త అందజేయటం కూడా జరిగింది. దీనికి సంబంధించిన ఎన్నో నిదర్శనాలను మీరు ముందు వాక్యాలలో తెలుసుకుంటారు.

## ఖుర్ఆన్ అందరి గ్రంథం

సృష్టికర్త అయిన దేవుడు మానవులకు రుజుమార్గం చూపించటానికి పంపిన ప్రవక్తలలో చిట్టచివరి వారే ముహమ్మద్ (స). దివ్యఖుర్ఆన్ ఆ అంతిమ దైవప్రవక్తపై అవతరించిన దైవగ్రంథమే తప్ప మరొకటి కాదు. ఈ కోణం నుంచి చూసినప్పుడు అంతిమ దైవగ్రంథమైన దివ్యఖుర్ఆన్ గత ప్రవక్తలను, గత కాలానికి చెందిన దైవగ్రంథాలను ధృవీకరిస్తుందేగాని, ఒక్క మాటలో అసలు అవేవీ దైవగ్రంథాలు కావని కొట్టిపారేయదు.

## ముహమ్మద్ (స) అందరి ప్రవక్త

మానవాళికి సన్మార్గం చూపించేందుకు దేవుని తరఫు నుంచి ప్రభవించిన ప్రవక్తల పరంపరలో చిట్టచివరి వారే ముహమ్మద్ (స). గత ప్రవక్తలకు సంబంధించిన ప్రాచీన ధర్మగ్రంథాల్లోనూ ఆయన రాక గురించి ముందుగానే శుభవార్త ఇవ్వబడింది. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స) గురించిన భవిష్యత్ ప్రకటనలు మనకు వైదిక సాహిత్యంలో అనేక చోట్ల గోచరిస్తాయి.

గత ప్రవక్తలు ఒక ప్రత్యేక జాతికో, ప్రత్యేక కాలానికో పంపబడ్డారు. కానీ ముహమ్మద్ ప్రవక్త (స) సకల మానవజాతికై ప్రవక్తగా పంపబడ్డారు.

**ఓ ప్రవక్తా! మేము నిన్ను సకల మానవ జాతికి ప్రవక్తగా చేసి పంపాము. దీనికి అల్లాహ్ సాక్ష్యం చాలు.** ***(ఖుర్ఆన్ 4:79)***

ముహమ్మద్(స) ప్రవక్త కేవలం ముస్లింల ప్రవక్త మాత్రమే కాదు. మనందరి కోసం దైవ సందేశాన్ని తెచ్చిన మనందరి అంతిమ దైవప్రవక్త. ఈయన రాకకు పూర్వమే వేద వేదాంగాలు ఆయన వస్తారని పేరుతో సహా తెలియజేశాయి.

## హిందూ ధర్మ గ్రంథాల్లో ముహమ్మద్ (స) గారి ప్రస్తావన

వేదాలలో మహనీయ ముహమ్మద్ (స) గురించి అనేకచోట్ల 'నరాశంస' పేరుతో ప్రస్తావించడమైనది.

**నరాశంసః యో నరౌ ప్రశస్యతే**

ఏ మానవుడైతే ప్రశంసింపబడతాడో.....

*(సాయణ్ భాష్య, ఋగ్వేదసంహిత,5:5:2)*

ముహమ్మద్(స) అనే అరబీ పదం యొక్క అర్థం కూడా ప్రశంసనీయుడు.

**ఓ భక్తులారా! ఈ బోధకుని మాటలు వినండి. ప్రశంసనీయుడు. ప్రశంసింపదగినవాడు అయిన ఆ మహర్షి 60,090 మంది మనుష్యుల మధ్య జనన మొందుతాడు. ఆయన ఇరవై అడ మగ ఒంటెల మధ్య సవారీ చేస్తాడు. అమోఘమైన వారి కీర్తి, స్వర్గం దాకా ప్రాకుతుంది.**

*(అధర్వణవేదం 20: కాండం 127: సూక్తం 1-3 మంత్రం)*

వివరణ: ముహమ్మద్(స) అనే అరబీ పదానికి అర్థం ప్రశంసనీయుడు. ముహమ్మద్(స) ప్రవక్త జన్మించేనాటికి మక్కా ప్రజలు సుమారు 60,090. మన ప్రవక్తలలో, ఋషులలో ఒంటెలపై ప్రయాణం చేసింది ముహమ్మద్(స) ప్రవక్త ఒక్కరే.

**"వేదాహమేత్ పురుష మహాన్త మాదిత్త యవర్ణ తమసః ప్రస్తావయనామ"**

*(యజుర్వేదం - 31:18)*

అర్థం: "వేద అహమద్ అనబడే ఈ వ్యక్తి మహోన్నతుడు, సూర్యునిలా ప్రకాశించి చీకటిని పారద్రోలే వాడు. ఆయనను తెలుసుకోవడం ద్వారానే ముక్తి పొందగలం. ఇది తప్ప ముక్తికి మరో మార్గమే లేదు".

**ఏతన్ మిన్నన్తరే మ్లేచ్ఛ ఆచార్యేణ సమన్వితః మహామద ఇతిఖ్యాతః శిష్యశాఖా సమన్వితః నృపశ్చైవ మహాదేవం మరుస్థల నివాసినమ్...**

*(భవిష్యత్ పురాణం పర్వం: 3 ఖండం:3 అధ్యాయం: 3 శ్లోకం:5-8)*

ఒక మ్లేచుడు (నిరక్షరాస్యుడు) పరదేశస్థుడైన ఒక బోధకుడు తన శిష్యులతోపాటు వస్తాడు. ఆయన పేరు ముహమ్మద్. ఆయన ఎడారి ప్రాంతానికి





చెందిన వారై ఉంటారు. ఆయన లింగచ్ఛేది (సున్నతి ఒడుగులు), తలపై ముడి ఉండదు. గడ్డం పెంచుకుని ఉంటారు. మాంసాహారి. బిగ్గరగా గొంతెత్తి మాట్లాడతారు. ముసలై (ముసల్మాన్)గా పరిచయం చేయబడతారు. *(భవిష్యత్ పురాణం ప్రతిసర్గ పర్వం-3 అధ్యాయం 3 శ్లోకం 25-27)*

వాస్తవంలో వేదగ్రంథాలలో కూడా ముహమ్మద్ ప్రవక్త గురించి భవిష్యవాణి ఉంది. ఆయన పేరును భవిష్య పురాణంలో ప్రస్తావించడం జరిగింది. ఇంకా ఆయన అట్టడుగువారైన విగ్రహారాధకులకు బోధిస్తారని కూడా ఉంది. ఇది నిజం-ఆయన "నిరక్షరాస్యుడు" అని అందులో చెప్పబడింది. ముహమ్మద్ ప్రవక్త విషయంలో ఇది కూడా జరిగింది. ఆయన నిరక్షరాస్యుడని తెలిసిపోయింది. నిజానికి రెండు చోట్ల ముహమ్మద్ ప్రస్తావన ఉంది. అది భవిష్య పురాణంలో మరియు అధర్వణ వేదంలోని 20వ కాండం, 127వ సూక్తి 1-3 మంత్రాలలో. ఆ విషయాలు ఉన్నాయి.

(క్రిష్ణా కాన్షియస్‌నెస్ & క్రిష్టియానిటీ పేజి నెం.78 సత్యరాజ దాస అధికారి)

బుద్ధగ్రంథాలలో కూడా మహనీయ ముహమ్మద్ (స) వారి గురించి ప్రస్తావించబడింది.

**"నందా! ఈ ప్రపంచంలో నేనే మొదటి మరియు చివరి బుద్ధుణ్ణి కాను. నా తరువాత కూడా బుద్ధులు వస్తారు....... ప్రపంచానికి స్వచ్ఛమైన సంపూర్ణమైన జీవితవిధానాన్ని తెలియజేసే బుద్ధుడు కూడా రానున్నాడు ఓ నందా ఆయన "మైత్రేయుడు"**

*(గాస్‌పెల్ ఆఫ్ బుద్ధా, కారుస్ పే॥217)*

మొత్తానికి తెలిసేదేమిటంటే ఏ సృష్టికర్త, నిజదేవుడైతే గతకాలపు ప్రవక్తలను ప్రభవింపజేశాడో, గత కాలపు ధర్మగ్రంథాలను ఈ లోకంలో అవతరింపజేశాడో మానవులందరి మార్గదర్శనం కోసం ముహమ్మద్ ప్రవక్త (స)ను ప్రభవింపజేసింది, దివ్యఖుర్‌ఆన్ గ్రంథాన్ని ఈ లోకంలో అవతరింపజేసింది ఆ ఏకైక విశ్వసృష్టికర్తే!

## 11. ముగింపు

నా ప్రియ నేస్తమా!

ఇప్పుడు నీవు ఏది సత్యమో ఏది అసత్యమో తేల్చుకోగల స్థితిలో ఉన్నావని నేను భావిస్తున్నాను.

### సత్యం ముందర ఉంది...

సత్యాన్ని అనుసరించి ఇహలోకంలోనూ, పరలోకంలోనూ విజయాన్ని సాధించు కుంటావో లేక తీవ్ర సందిగ్ధానికి లోనై నిర్హేతుక, అధృవీకృత విషయాల తాత్త్విక జగత్తులో కొట్టుమిట్టాడుతూ జీవితం గడపాలని నిర్ణయించుకుంటావో అది నీ ఇష్టం.

ఎన్ని అనుకున్నప్పటికీ ఈ సత్యాన్ని స్వీకరించి దివ్య ఖుర్‌ఆన్ చూపిన మార్గంలో జీవితం గడపటమే ఇహలోకంలోనూ, పరలోకంలోనూ ముక్తికి ఏకైక మార్గం. దివ్య ఖుర్‌ఆన్ మానవాళి కొరకు దేవుడు అవతరింపజేసిన మార్గదర్శక గ్రంథం. పునరుత్థాన దినం వరకూ అది మానవులకు సరైన మార్గం చూపిస్తూ ఉంటుంది.

ప్రియ నేస్తమా! చివరగా దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ క్రింది వాక్యాలను నీ ముందుంచి నా మాటలను ముగిస్తున్నాను:

> మానవులారా! మిమ్మల్నీ, మీకు పూర్వం వారినీ పుట్టించిన మీ ప్రభువునే ఆరాధించండి-తద్వారానే మీరు (పాపాల నుండి) సురక్షితంగా ఉంటారు. ఆయనే మీ కోసం భూమిని పాన్పుగానూ, ఆకాశాన్ని కప్పుగానూ చేశాడు, ఆకాశం నుంచి వర్షాన్ని కురిపించి, తద్వారా పండ్లు ఫలాలను పండించి మీకు ఉపాధినొసగాడు. ఇది తెలిసి కూడా మీరు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా నిలబెట్టకండి.
>
> మేము మా దాసునిపై అవతరింప జేసిన దాని విషయంలో ఒకవేళ మీకేదన్నా అనుమానముంటే, అటువంటిదే ఒక్క సూరానైనా (రచించి) తీసుకురండి. మీరు సత్యవంతులే అయితే (ఈ పని కోసం) అల్లాహ్‌ను తప్ప మీ సహాయకులందరినీ పిలుచుకోండి. *(ఖుర్‌ఆన్ 2 : 21-23)*
>
> ధర్మం విషయంలో బలవంతం ఏమీ లేదు. సన్మార్గం అపమార్గం నుంచి ప్రస్ఫుటమయ్యింది. కనుక ఎవరయితే అల్లాహ్ తప్ప వేరితర





> ఆరాధ్యులను (తాగూత్‌ను) తిరస్కరించి అల్లాహ్‌ను మాత్రమే విశ్వసిస్తారో వారు దృఢమైన కడియాన్ని పట్టుకున్నారు. అది ఎన్నటికీ తెగదు. అల్లాహ్ సర్వం వినేవాడు, సర్వం తెలిసినవాడు. *(ఖుర్‌ఆన్ 2 : 256)*
>
> "అందరికన్నా గొప్ప సాక్ష్యం ఎవరిది?" అని వారిని అడుగు. "నాకూ-మీకూ మధ్య సాక్షిగా అల్లాహ్ ఉన్నాడు. ఈ ఖుర్‌ఆను ద్వారా నేను మిమ్మల్నీ, ఇది ఎవరెవరి వరకు చేరుతుందో వారందరినీ హెచ్చరించటానికి గాను ఈ ఖుర్‌ఆన్ నా వద్దకు వహీ ద్వారా పంపబడింది" అని (ఓ ప్రవక్తా!) వారికి తెలియపరచు. అల్లాహ్‌తో పాటు మరి కొంతమంది దేవుళ్లు కూడా ఉన్నారని మీరు నిజంగా సాక్ష్యం ఇవ్వగలరా? "నేను మాత్రం అలాంటి సాక్ష్యం (ఇవ్వనుగాక) ఇవ్వను" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు. "ఆయనే ఒకే ఒక్కడైన ఆరాధ్య దేవుడు. మీరు దైవానికి కల్పించే షిర్క్ (భాగ స్వామ్యం)తో నాకెలాంటి సంబంధం లేదు" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పెయ్యి. *(ఖుర్‌ఆన్ 6 : 19)*

మొత్తానికి వివిధ హిందూ మత గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిశీలించినట్లయితే హైందవ తత్వాల మెలికల్లో చిక్కుకొని మరుగున పడిపోయిన ఓ ప్రాచీన సత్యం మళ్ళీ తెరపైకి వస్తుంది. ఆ సత్యమే ఇది.

## "సృష్టిని కాదు, సృష్టికర్త అయిన నిజదేవుణ్ణి ఆరాధించండి."

ఇప్పటివరకు విభిన్న మత గ్రంథాలలోని వివిధ సాక్ష్యాధారాలతో నిరూపించ బడిన పై సత్యాన్ని గనక మనం ఆచరణలోకి తీసుకు వస్తే, దేవుని కృపతో మనలో ప్రతి ఒక్కరూ ముక్తిని సాధించగలుగుతారు.

ధర్మస్థాపనకై, సత్యశోధనకై నిత్యం ప్రయత్నిస్తూ ఉండాలి.

**మనందరిదీ ఒకే జాతి – మనందరి దేవుడూ ఒక్కడే**

మరిన్ని వివరాలకై సంప్రతించండి:
**Email : ekam.advitiyam@gmail.com**
**Mobile : +91 9032430375**